


వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్ : fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-11-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 292 పేజీలు: 8+16 వెల: 8.00

స్నేహాఫామ్స్‌పై ఐటి దాడులు 3

మ్యూజియంగా సోనియా ఇటలీ నివాసం 5

పేదరికానికి దూరంగా 50 కోట్ల మంది



గంగపై అతిపెద్ద 'నితీశ్ సేతు'ను ప్రారంభించిన ప్రధాని మోడీ



ఎన్డీయె పాలనలో నేరగాళ్లకు చెక్

పాట్నా,నవంబరు 21: బీహార్‌లో ఎన్‌డీఏ అధికారంలోకి రాక ముందు కేవలం కుంభకోణాల గురించే చర్చ జరిగేదని, కానీ నేడు, పెట్టుబడులు, అభివృద్ధి, నేరస్థులపై తీసుకుంటున్న కఠిన చర్యల గురించి చర్చించుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల పాటు గరీబీ హఠావో అని ఇచ్చిన నినాదాన్ని, తాము కేవలం12ఏళ్లలోనే చేసి చూపించామని అన్నారు. సుమారు50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురాగలిగామని తెలిపారు. శనివారం, >>2

బీహార్‌లో 34,470 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు జాతికి అంకితం

4 వేల కోట్లతో 'ఏరోస్పేస్'

భారీగా సఫ్రాన్ సంస్థ పెట్టుబడులు

వచ్చేనెల ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో ఎంఒయు

ఫ్రాన్స్ పర్యటనలో డి.సిఎం భట్టి



పారిస్‌లోని సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రతినిధులతో డి.సిఎం భట్టి

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు వేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తెలంగాణలో సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసిందన్నారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా శనివారం సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, ఇప్పటికే కొనసాగుతున్న కార్యకలాపాల విస్తరణ, కొత్త తయారీ >>2

రాజగోపాల్‌రెడ్డికి షాక్!

కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఫోన్

రేపు కొత్త ఇన్‌చార్జి సందీప్‌తో భేటీ కావాలని ఆదేశం

మరింత వేడెక్కిన మునుగోడు ఎమ్మెల్యే వాఖ్యల దుమారం



హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త: తెలంగాణ కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. సొంత పార్టీ ప్రభుత్వంపై ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో తాజాగా ఏఐసీసీ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు సమాచారం. ఈ నెల 23న తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జ్ సందీప్‌తో సమావేశం కావాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ భేటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవల ఓ కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. కొద్దిపాటి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడటం, ప్రజల అవసరాలను పట్టించుకోకుండా పాలన సాగించడం వంటి అంశాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి పాలకులను తెలంగాణ ప్రజలు, చరిత్ర ఎన్నటికీ క్షమించబోదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేశారనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. గతంలోనూ పలు సందర్భాల్లో ప్రభుత్వ పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడంతో తాజాగా చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ >>2

కెసిఆర్ భూముల వివరాలు అసెంబ్లీలో వెల్లడిస్తాం

ఫామ్‌హౌస్ సర్వే ప్రక్రియ దాదాపు పూర్తి



కాళేశ్వరం నిర్మాణం మార్పు చేసి ప్రజాధనం గోదారిలో కలిపిన గత ప్రభుత్వం

డిపిఆర్‌లోని డయాఫ్రంవాల్ ఎందుకు నిర్మించలేదు?

ఎన్‌డిఎస్ సూచనల మేరకే మరమ్మతులు..

మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్ హౌస్ భూముల లెక్కలను తీరలోనే అసెంబ్లీ వేదికగా బయటపెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పొంగులేటి మాట్లాడుతూ కెసిఆర్ ఫామ్ హౌస్ భూముల సర్వే ప్రక్రియ దాదాపు పూర్తయిందని వెల్లడించారు. అయితే సర్వే ప్రారంభం కాగానే మాజీ మంత్రి హరీష్‌రావు మామ హనుమంతరావు తన భూమి విషయంలో కోర్టుకు వెళ్లి ముందస్తు స్టే తెచ్చుకున్నారని, తప్పు చేయనప్పుడు సర్వే నిర్వహణపై ఎందుకు స్టే తెచ్చుకున్నారని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లాలో ఎర్రవెల్లి, శివారు వెంకటాపూర్ గ్రామాల్లో సర్వే తుది దశకు చేరుకుందని, త్వరలోనే ఈ భూములకు సంబంధించి పూర్తి వివరాలను అసెంబ్లీలో ప్రవేశపెడతామని తెలిపారు. రాష్ట్రంలో భూభారతి పోర్టల్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలు దాదాపు పరిష్కారమయ్యాయని తెలిపారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, లోపభూయిష్టమైన డిజైన్లు, నిర్మాణంలో పాటించని >>2



గోదావరి పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు

8 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం: సిఎస్

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త: ప్రతిష్ఠాత్మకమైన గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల పనులు >>2



తెలంగాణ భవన్‌లో శనివారం పలువు నేతలు పార్టీలో చేరిన సందర్భంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

మళ్లీ బిఆర్ఎస్ సర్కార్ ఖాయం

అన్ని సర్వేలు అదే చెబుతున్నాయి: హరీష్‌రావు

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త: 'ఖైరతాబాద్‌లో బిఆర్ఎస్ పార్టీ మీద గెలిచి పార్టీ మారిన దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేసింది.. రేపో మాపో ఎన్నికలు రాబోతున్నాయి.. ఈ సమయంలో ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ దుకాణం ఖాళీ అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.. ఇది బీఆర్ఎస్ గెలుపునకు ఒక గొప్ప సూచిక అని అన్నారు. సోమాజిగూడ డివిజన్ యువ నాయకుడు మహేశ్ యాదవ్ ఆధ్వర్యంలో త్రినాథ్‌తోపాటు పలువురు కార్యకర్తలు మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హరీశ్ రావు గులాబీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఈ మధ్య రాష్ట్రంలో ఎవరూ సర్వే >>2

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..

2

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ కౌంటర్

కుటుంబంలో ఒక్కరికే బీమా

రేషన్ కార్డే ప్రామాణికం.. యేడాది పాటు బీమా రక్షణ

18 నుండి 59 యేళ్ల లోపు వయోపరిమితి

ప్రణాళికా శాఖచే మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: సమాజంలోని బలహీన వర్గాలకు ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కల్పించడమే లక్ష్యంగా కలిగిన ఇందిరమ్మ బీమా పథకం కుటుంబంలో అర్హత కలిగిన ఒకరికి మాత్రమే వర్తించనుంది. బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో దరఖాస్తులో పేర్కొన్న నామినీలకు రూ.5 లక్షల పరిహారం అందుతుంది. ఈ మేరకు దీనికి సంబంధించిన మార్గదర్శకాలను శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం రేషన్ కార్డు నంబరునే దరఖాస్తు ఫారం నంబరుగా పరిగణిస్తారు. ఇతర జిల్లాకు చెందిన రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు తమకు సమీపంలోని నమోదు శిబిరంలో దరఖాస్తు చేసుకోవచ్చు. వారి వివరాలను సంబంధిత స్వస్థల జిల్లా నుంచి సేకరిస్తారు. వివరాల పరిశీలనను స్వస్థల జిల్లాకు చెందిన అధికారులు చేపడతారు. ఒక రేషన్ కార్డుపై ఒక దరఖాస్తుకు మాత్రమే అనుమతి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో జారీ చేసిన రేషన్ కార్డుల ఆధారంగానే నమోదు ప్రక్రియ చేపడతారు. నమోదు సమయంలో ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ ఫోన్ నంబరుతో పాటు, రేషన్ కార్డు ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న కుటుంబాలు తమకు కేటాయించిన రేషన్‌షాపులో ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకంలో నమోదు చేసుకునే సమయానికి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి. 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు ఈ పథకానికి అర్హులు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన వార్డుల పరిధిలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తారు. శిబిరాల >>2





ఇటానగర్‌లో శనివారం అరుణాచల్ ప్రదేశ్ పోలీసులకు 'ప్రెసిడెంట్స్ కలర్'లను ప్రదానం చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

రాజగోపాల్‌రెడ్డికి షాక్!

>> వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రాజగోపాల్‌రెడ్డి, అనిరుద్ధరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ పరిశీలిస్తోందని, క్రమశిక్షణ చర్యల విషయంలో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర నాయకత్వం పరిధిని దాటి పార్టీ అధిష్ఠానం పరిశీలనలోకి వెళ్లినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 23న కొత్త ఇన్‌చార్జ్ సందీప్‌తో రాజగోపాల్‌రెడ్డి సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ భేటీలో ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయన వివరణ కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. పార్టీ నాయకత్వం తన అభిప్రాయాలను వెల్లడించడంతో పాటు, భవిష్యత్తులో పార్టీ వ్యవహారాలపై అనుసరించాల్సిన విధానాన్ని వివరించే అవకాశం కూడా ఉందని చర్చ సాగుతోంది. సమావేశం అనంతరం ఏఐసీసీకి నివేదిక వెళ్తుందా? పార్టీ నాయకత్వం హెచ్చరికతో సరిపెడుతుందా? లేక క్రమశిక్షణ చర్యల దిశగా అడుగులు వేస్తుందా? అన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. మునుగోడులో బలమైన రాజకీయ నేతగా గుర్తింపు ఉన్న రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం కాంగ్రెస్‌కు రాజకీయంగా కీలకమే. గతంలో పార్టీ మారిన ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంపై సొంత పార్టీ నేతల వ్యాఖ్యలు చర్చకు వస్తున్న నేపథ్యంలో ఆయన వ్యవహారాన్ని అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందనేది ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రతిపక్షాల విమర్శలు, మరోవైపు సొంత పార్టీ నేతల అసంతృప్తి వ్యాఖ్యలు.. ఈ పరిణామాల మధ్య రాజగోపాల్‌రెడ్డి ఎపిసోడ్ కాంగ్రెస్ నాయకత్వానికి సవాలుగా మారింది.

కుటుంబంలో ఒక్కరికే బీమా

>> నిర్వహణకు సంబంధించి వేదికలు, తేదీలు, బాధ్యతలు చేపట్టే అధికారుల వివరాలను ముందుగానే ఖరారు చేసి ప్రజలకు తెలియజేస్తారు. నెల రోజుల పాటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నమోదు ప్రక్రియనమోదు సమయంలో బీమా పొందే వ్యక్తి, నామినీల వివరాలు, ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకున్నప్పుడు బీమా పరిహారాన్ని వారి మధ్య ఏ విధంగా పంపిణీ చేయాలనే అంశాలను అధికారులకు స్పష్టంగా వివరించాలి. లబ్ధిదారుడికి బీమా రక్షణ ప్రారంభమైన తేదీ నుంచి సంవత్సరం ముగిసే వరకు ఉంటుంది. ఈ కాలంలో లబ్ధిదారుడు గరిష్ఠ వయోపరిమితిని దాటినా, ఆ పాలసీ సంవత్సరం ముగిసే వరకు బీమా రక్షణ కొనసాగుతుంది. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర బీమా పథకాల ద్వారా పొందుతున్న వారు వాటి వివరాలను కూడా దరఖాస్తులో నమోదు చేయాల్సి ఉంటుంది. నమోదు పూర్తయిన ప్రతి లబ్ధిదారుడికి లావాదేవీ గుర్తింపు సంఖ్యతో కూడిన రసీదు సందేశం పంపిస్తారు. ఫిర్యాదుల పరిష్కారం, ప్రత్యేక సమస్యల నిర్వహాప్రతి నమోదు శిబిరంలో ఫిర్యాదులు, సందేహాలు, వివరాల్లో తేడాలు, ఇతర ప్రత్యేక సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ లేదా బాధ్యతాయుత అధికారిని నియమించాలి. ప్రతి ఫిర్యాదు లేదా సమస్యకు సంబంధించిన వివరాలు, కుటుంబ గుర్తింపు సమాచారం, ఫిర్యాదు అందిన తేదీ, బాధ్యత వహించే అధికారి, తీసుకున్న చర్యలను రికార్డుల్లో నమోదు చేయాలి. సమస్యను పరిష్కరించుకునేందుకు అవసరమైన చర్యలు, ఎవరిని సంప్రదించాలి అనే విషయాలను సంబంధిత కుటుంబాలకు స్పష్టంగా తెలియజేయాలి. పరిష్కారం కాని సమస్యలను రోజువారీ జిల్లా స్థాయి సమీక్షలో పరిశీలించాలి. రాష్ట్ర స్థాయిలో స్పష్టత అవసరమైన అంశాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

గోదావరి పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు

>> అన్నింటినీ నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేసేలా సంబంధిత శాఖలన్నీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా రాష్ట్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.
గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, సన్నద్ధతపై శనివారం అన్ని సంబంధిత శాఖల అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల కోసం చేపడుతున్న ఏర్పాట్లు, కార్యాచరణపై అధికారులు సమగ్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.
2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సుమారు 8 కోట్ల మంది భక్తులు గోదావరి నదికి వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, పుష్కరాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తగిన మౌలిక సదుపాయాలు కల్పించడం, భక్తులకు అవసరమైన సౌకర్యాలు అందించడం, అన్ని శాఖల మధ్య సమన్వయం సాధించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.
పుష్కరాలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పన కోసం మొత్తం 67 ప్రాంతాలను గుర్తించారు. భక్తుల ప్రాధాన్యత, రాకపోకల సంఖ్యను అంచనా వేసి ఈ ప్రాంతాలను మూడు కేటగిరీలుగా విభజించారు. ఇందులో మొదటి కేటగిరీలో 11 ప్రాంతాలు, రెండో కేటగిరీలో 13 ప్రాంతాలు, మూడో కేటగిరీలో 43 ప్రాంతాలను చేర్చారు.
అన్ని మౌలిక సదుపాయాలు, ఇంజినీరింగ్ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళిక, వివిధ శాఖల మధ్య సమన్వయం, పనులపై నిరంతర పర్యవేక్షణ ఎంతో అవసరమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. పుష్కరాలకు సంబంధించిన పనులకు ప్రాధాన్యతనిస్తూ, పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ఈసమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

4 వేల కోట్లతో 'ఏరోస్పేస్'

>> యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోయింగ్, ఎయిర్‌బస్ వంటి అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలకు ఇంజిన్లను సరఫరా చేస్తున్న సఫ్రాన్ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు రావడం కీలక పరిణామంగా పేర్కొన్నారు. ఈ భారీ పెట్టుబడి ప్రతిపాదన కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో ఏరోస్పేస్, విమాన విడిభాగాల తయారీ రంగాలకు మరింత ఊతం లభించనుందన్నారు. డిసెంబర్ 2026లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఈ పెట్టుబడికి సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరే అవకాశం ఉందని చెప్పారు. ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు వేగంగా అనుమతులు కల్పించేలా ప్రభుత్వ విధానాల రూపకల్పన జరిగిందన్నారు. డిసెంబర్‌లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు పారిస్ నుంచి సంస్థ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో సఫ్రాన్ ఇప్పటికే లీప్ విమాన ఇంజిన్లకు అవసరమైన రొటేటింగ్ పార్ట్స్ తయారీ కేంద్రం, సఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ తయారీ యూనిట్‌తో పాటు, విమాన ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రాల్లో ఒకటైన లీప్ ఎంఆర్ఓ సదుపాయాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. కాగా సఫ్రాన్ సంస్థ అంతర్జాతీయ కార్యకలాపాలు, పౌర, సైనిక విమానాల ఇంజిన్ల రూపకల్పన, తయారీ, నిర్వహణ విధానాలను ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. అనంతరం తయారీ విభాగాన్ని సందర్శించిన విక్రమార్క విమాన ఇంజిన్ల విడిభాగాల తయారీ, అసెంబ్లీ ప్రక్రియలను పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత కచ్చితత్వంతో కూడిన విడిభాగాలను తయారు చేస్తున్న విధానాలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, సఫ్రాన్ సంస్థ ఇండస్ట్రియల్ అండ్ సప్లై చైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లారెంట్ మజౌ, ఇండస్ట్రియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ రొటేటింగ్ పార్ట్స్ డైరెక్టర్ జూలియన్ డిఖి ఒరాజియో తదితరులు పాల్గొన్నారు. రూ. 4,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనను ఖరారు చేసేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ సఫ్రాన్ సంస్థ ప్రతినిధులతో తదుపరి సంప్రదింపులు కొనసాగించనుంది. ఈ పెట్టుబడి సాకారమైతే తెలంగాణలో ఏరోస్పేస్ తయారీ రంగం మరింత విస్తరించడంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు కొత్త మార్గాలు ఏర్పడనున్నాయి.

వారం - వర్జ్యం

22-11-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, అనురాధ కార్తె,
తి. త్రయోదశి రా.2.34, న.అశ్విని తె.4.14
వ.రా.12.33 - రా.2.02
దు.మ.3.58 - సా.4.43
రాహు.సా.4.30-సా.6.00
శుభ స. ఉ.8.00-ఉ.9.00

వారఫలం

మేషం: సంఘంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. అపురూపమైన వస్తువులు సేకరిస్తారు. శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది.

వృషభం: భూముల కొనుగోలు ముమ్మరం చేస్తారు. బంధువుల నుండి కీలక సమాచారం ఎంతో ఉపకరిస్తుంది.

మిథునం: ప్రముఖుల నుండి మాట సాయం అందుకుంటారు. వృత్తిలో కొంత వరకు అభివృద్ధి కనబడుతుంది. శుభవార్తలు.

కర్కాటకం: ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

సింహం: జీవిత భాగస్వామి సలహాలతో ముందుకు సాగుతారు. ఇంటాబయట కొన్ని సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

కన్య: భాగస్వామ్య వ్యాపారాలలో లాభాలు కష్టమే. వివాదాలకు దూరంగా ఉండండి. ప్రయత్నాలలో తొందరపాటు వద్దు.

తుల: గృహ నిర్మాణ ఆలోచనలలో ఆటంకాలు ఎదురైన ముందుకు సాగుతారు. ఉద్యోగాలలో అనుకోని మార్పులు ఉంటాయి.

వృశ్చికం: నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. సోదరుల కలయిక.

ధనుస్సు: శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు. పెద్దల సలహాలు తీసుకుంటారు.

మకరం: చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురు అవుతాయి. సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి. స్వల్ప ధనలాభం.

కుంభం: కీలక విషయాలలో సొంత నిర్ణయాలు మంచిది. శ్రమకు తగిన ఫలితం కష్టమే. ఆరోగ్యంపట్ల శ్రద్ధ చాలా అవసరం.

మీనం: నూతన తరహా ఆలోచనలు చేసి ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తారు. విలువైన వస్తువులను కొనుగోలు చేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

కెసిఆర్ భూముల వివరాలు అసెంబ్లీలో వెల్లడిస్తాం

>> సాంకేతిక ప్రమాణాలే ప్రధాన కారణమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన పునాది భద్రత విషయంలో శాస్త్రీయ ప్రమాణాలను పక్కనపెట్టి, డీపీఆర్‌లో పేర్కొన్న నిర్మాణ విధానానికి భిన్నంగా సీకెంట్ పైల్ విధానాన్ని ఎందుకు ఎంచుకున్నారో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన డీపీఆర్‌లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని ప్రతిపాదించి, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో సీకెంట్ పైల్ కట్‌ఆఫ్ విధానాన్ని అనుసరించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ఇంతటి భారీ ప్రాజెక్టులో నిర్మాణ పద్ధతులను మార్చే ముందు సమగ్ర భూగర్భ పరిశోధనలు, సాంకేతిక అధ్యయనాలు, నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉండగా, అప్పటి ప్రభుత్వం వాటిని ఏ మేరకు పాటించిందో ప్రజలకు వివరించాలన్నారు. డయాఫ్రమ్ వాల్, సీకెంట్ పైల్ రెండూ భూగర్భంలో నీటి ప్రవాహాన్ని నియంత్రించడానికి, పునాదుల భద్రతకు ఉపయోగించే ఇంజినీరింగ్ నిర్మాణ విధానాలే. అయితే వాటి నిర్మాణ పద్ధతుల్లో గణనీయమైన తేడా ఉందని మంత్రి తెలిపారు. కానీ మేడిగడ్డ విషయంలో సీకెంట్ పైల్స్ నిర్మాణంలో నాణ్యతా నియంత్రణ, పునాది భద్రతకు సంబంధించిన లోపాలు వెలుగులోకి వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఏ బ్యారేజ్ నిర్మాణం కూడా ఈనాటి వరకు సీకెంట్ పైల్ పద్ధతిలో నిర్మించలేదని స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (విదీళీతి) నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి ప్రణాళిక, డిజైన్, నిర్మాణ నాణ్యత, నిర్వహణలోని లోపాలు సమిష్టిగా కారణమయ్యాయని మంత్రి వివరించారు. బ్యారేజీ పునాది కింద ఉన్న ఇసుక తరలిపోవడం, పునాదికి తగినంత బేరింగ్ సామర్థం లేకపోవడం, అప్‌స్ట్రీమ్ సీకెంట్ పైల్స్ పై బ్యారేజీ భారం ప్రభావం చూపడం వంటి అంశాలను ఎన్‌డీఎస్‌ఏ గుర్తించిందని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో ఒకే తరహా డిజైన్, నిర్మాణ విధానాలు అనుసరించారని మంత్రి తెలిపారు. మేడిగడ్డలో ఎదురైన సమస్యలు మిగతా రెండు బ్యారేజీలకూ తలెత్తే ప్రమాదం ఉందని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించిందన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి బదులుగా సీకెంట్ పైల్ విధానాన్ని ఎంచుకోవడానికి ఉన్న సాంకేతిక ప్రాతిపదిక ఏమిటి? ఈ మార్పులకు ఎవరు అనుమతించారు? నిపుణుల కమిటీలు ఏం సూచించాయి? నిర్మాణ సంస్థలకు ఈ ప్రత్యేక విధానంలో ఎంతటి అనుభవం ఉంది? నాణ్యతా ప్రమాణాలను ఎవరు పర్యవేక్షించారు? అనే ప్రశ్నలకు అప్పటి పాలకులు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లోకి ఎలా వెళ్లాలో, ఎన్నికల ఆట ఎలా ఆడాలో మాకు బాగా తెలుసునని చెప్పారు. ఎన్నికల ఆటను పర్ఫెక్ట్‌గా ఆడుతున్నాం అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గోల్ కొడతాం, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నట్లుగానే ఇప్పుడు కూడా పార్టీలో కష్టపడే స్వభావం, అంకితభావం కలిగిన నాయకులు, కార్యకర్తల బలమైన టీమ్ ఉంది అని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీకి ప్రజలతో ఉన్న అనుబంధం, క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులు, కార్యకర్తలే మా బలం. బీఆర్ఎస్, బీజేపీ ఎన్ని రాజకీయ వ్యూహాలు పన్నినా ఎదుర్కోవడానికి మేము సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రంలో బీజేపీకి చెప్పుకోదగిన రాజకీయ విస్తరణ లేదని నా అభిప్రాయం. ప్రస్తుతం ఉన్న ఎనిమిది అసెంబ్లీ స్థానాలను నిలబెట్టుకోవడమే ఆ పార్టీకి పెద్ద సవాల్. ఎప్పుడు ఎలాంటి రాజకీయ పోరాటం చేయాలో మాకు తెలుసు. సరైన సమయంలో సరైన వ్యూహంతో ముందుకెళ్లి రాజకీయంగా విజయం సాధిస్తాం' అని అన్నారు. 'ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు కేంద్రం నుంచి సహకారం లభిస్తుందని ఆశిస్తున్నాం. ఎక్కడా విద్యుత్ సరఫరా సమయం తగ్గలేదు' అని చెప్పారు.



చెన్నైలో శనివారం అనిరుధ్ రవిచందర్, సన్ రైజర్స్ హైదరాబాద్ సిఇఒ కావ్య మారన్‌ల రిసెప్షన్‌కు హాజరైన సిఎం రేవంత్, సినీ నటుడు రజనీకాంత్, తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ తదితరులు

చెన్నైలో వైభవంగా కావ్యా, అనిరుధ్ రిసెప్షన్.. రేవంత్‌రెడ్డి, విజయ్ హాజరు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు21: చెన్నైలో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, సన్ రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్‌ల రిసెప్షన్ గ్రాండ్ గా నిర్వహించారు. ఈ వేడుకకు పలువురు రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. తమిళనాడు సిఎం విజయ్, కేరళం సిఎం సతీశన్, ఏపీ మంత్రి నారా లోకేశ్, సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ సిఎం ఎంకె స్టాలిన్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, క్రికెటర్ భువనేశ్వర్ కుమార్ తదితర సెలబ్రెటీలు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, ఈనెల 11న గ్రీస్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, మిత్రుల సమక్షంలో కావ్యా, అనిరుధ్‌ల వివాహం వైభవంగా జరిగింది.

పేదరికానికి దూరంగా 50 కోట్ల మంది

>> బిహార్ మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గౌరవార్థం ప్రారంభించిన ఆధునిక వంతెనకు నీతీశేసేతు అని నామకరణం చేశారు. అనంతరం, వైశాలిలో ఏర్పాటు చేసిన సభలో మోడీ ప్రసంగించారు. బీహార్‌లో గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ఎన్‌డీఏ పాలనకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మోడీ ప్రముఖంగా ప్రస్తావించారు. గత మూడు దశాబ్దాలుగా బీహార్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, నీతీశ్‌కుమార్ అందించిన సుపరిపాలనను ప్రస్తుత ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ఆయన బృందం కొనసాగిస్తున్నారని చెప్పారు. అలాగే దివంగత నేత రామ్ విలాస్ పాశ్వాన్ కలలను తమ ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. ఉచిత వైద్య చికిత్స హామీ వల్ల సామాన్యులకు వైద్య ఖర్చుల భారం తగ్గి ఎంతో ఉపశమనం లభించిందన్నారు. పట్టణ రవాణాను మరింత సౌకర్యవంతంగా చేయడానికి బిహార్‌లోని వైశాలిలో 100 ఎలక్ట్రిక్ బస్సులను మోడీ జెండా ఊపి ప్రారంభించారు. మరోవైపు, దశాబ్దాలుగా ఉన్న మౌలిక సదుపాయాల డిమాండ్ నెరవేరడాన్ని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా ప్రశంసించారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకత్వమే కారణమని కొనియాడారు. వైశాలి పర్యటన సందర్భంగా రోడ్డు అనుసంధానం, ఇంధనం, పట్టణ మౌలిక సదుపాయాలు, నీటి వనరులు, విద్య, ఆరోగ్య సంరక్షణ, రవాణా వంటి కీలక రంగాల్లో సుమారు రూ. 34,470 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో మోడీపై చేసిన దూషణలు ఏవైనప్పటికీ, ఆయన నాయకత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి స్పష్టం చేశారు. మోడీ చేతుల మీదుగా నీతీశేసేతు ప్రారంభోత్సవం జరగడాన్ని ఒక ముఖ్య మైలురాయిగా ఆయన అభివర్ణించారు. మోడీ మార్గదర్శకత్వంలో 2037 నాటికి సమృద్ధిగల బీహార్‌ను, 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించే దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోందని చెప్పారు.

నా విజ్ఞప్తితోనే పసిడి కొనుగోళ్లు తగ్గించారు
అందుకే నేడు ధరలు తగ్గాయి: ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,నవంబరు 21: బంగారం ధరలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొన్ని నెలల క్రితం తాను చేసిన విజ్ఞప్తి మేరకు దేశ ప్రజలు బంగారం కొనుగోళ్లను నిలిపివేశారని, ఇప్పుడు ధరలు తగ్గాయని అన్నారు. తన మాట విన్న ప్రజలు డబ్బును ఆదా చేసుకోగలిగారని చెప్పారు. ఒక్క ఏడాది పాటు అవసరం లేకపోతే బంగారం కొనవద్దని గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఇది పాటించిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని.. ఆ సలహాతో తమ డబ్బు ఆదా అయిందని తనతో చెబుతున్నారని వివరించారు. లక్నోలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ... "అవసరం లేకపోతే ఓ ఏడాది పాటు బంగారం కొనకుండా ఉండాలని కొన్ని నెలల క్రితం దేశ ప్రజలకు సూచించా. రోజుకు ఒకపూట భోజనం మానేయాలని గతంలో లాల్ బహదూర్ శాస్త్రి చేసిన విజ్ఞప్తిని పాటించిన ఈ దేశ ప్రజల స్వభావం ఈనాటికీ అలాగే ఉండటం సంతోషాన్ని కలిగిస్తోంది. నాలాంటి సాధారణ వ్యక్తి చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని తక్కువ బంగారం కొనుగోలు చేశారు. ఇప్పుడు వాటి ధరలు తగ్గాయి అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితులతో బంగారం ధరలు పెరుగుతున్నాయని ఏడాది పాటు కొనుగోళ్లను నిలిపివేద్దామని ఈ ఏడాది మేలో ప్రధాని మోడీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పండుగలు, శుభకార్యాలైనా దానిపై ఆసక్తి చూపించొద్దని సూచించారు. సికింద్రాబాద్లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ బంగారం దిగుమతులు తగ్గితే విదేశీ మారకద్రవ్యం పెరుగుతుందన్నారు. ఇటీవల బంగారం ధరలు భారీగా తగ్గిన నేపథ్యంలో మోదీ వాటిని గుర్తుచేశారు.

మళ్లీ బిఆర్ఎస్ సర్కార్ ఖాయం

>> చేయించినా.. రేవంత్ రెడ్డి చేయించుకున్నా.. ఏజెన్సీలు చేసినా.. ఏ పార్టీ సర్వే చేసినా అన్ని సర్వేల్లో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వస్తుందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్రంలోని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. 'ఇండస్ట్రీలను ఆకర్షిస్తా.. నేను భారత్ సమ్మిట్‌ను పెడతా అంటుండు రేవంత్ రెడ్డి.. అసలు ఈ రాష్ట్రానికి రెండేళ్ల నుంచి పరిశ్రమల కార్యదర్శే లేడు. ఐటీ శాఖకు సెక్రటరీనే లేడు.. ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి.. ఐటీ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి.. చీఫ్ సెక్రటరీని ఇన్‌చార్జ్‌గా పెట్టి నడిపిస్తున్నరు.. ఆ చీఫ్ సెక్రటరీకి సవాలక్ష పనులుంటాయి.. ఆయన ఏం టైం ఇవ్వగలుగుతడు.. ఆయన పరిశ్రమలకు, పారిశ్రామిక వేత్తలకు టైం ఇవ్వగలుగుతడా..? ఐటీ కంపెనీలకు టైం ఇవ్వగలుగుతడా..? మీ పాలన ఎట్లుందంటే ఇండస్ట్రీకి, ఐటీకి కనీసం ఒక సెక్రటరీని కూడా అపాయింట్ చేయని పరిపాలన.. మీ కాంగ్రెస్ పాలన. ఇక మీరు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ గురించి మాట్లాడుతురన్నాని దుయ్యబట్టారు.

ఒవైసీపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త: టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమను ఉద్దేశించి ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు శనివారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిసి ఒవైసీపై అధికారికంగా ఫిర్యాదు చేశారు. మహిళా నేతపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని, ఈ వ్యవహారంపై ఒవైసీకి నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కోట నీలిమ సనత్‌నగర్ నియోజకవర్గంలో మహిళలు, మైనారిటీలు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బలమైన నేత అని తెలిపారు. రాజకీయ విభేదాల కోసం మహిళా ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం వారి గౌరవానికి భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళల గౌరవాన్ని కాపాడేలా మహిళా కమిషన్ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ వివాదం కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ పవన్ ఖేరా చేసిన వ్యాఖ్యలతో మొదలైంది. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రశేఖర్ ఆజాద్‌కు చెందిన ఆజాద్ సమాజ్ పార్టీతో ఎంఐఎం పొత్తు పెట్టుకోవడాన్ని ప్రస్తావిస్తూ పవన్ ఖేరా హిందీ సినిమా 'మైన్ తులసి తేరే ఆంగన్ కీ'

వ్యవసాయ్ వర్సిటీలో 566 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ ఆమోదం

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మొత్తం 566 పోస్టుల్లో బోధనా సిబ్బంది నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు దీనికి సంబంధించి విశ్వవిద్యాలయం చేసిన ప్రతిపాదనల ఆధారంగా ఆర్థిక శాఖ ఈ నియామకాలకు ఆమోదం ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం జారీ చేసిన ఒక లేఖలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) నిర్దేశించిన నియామక మార్గదర్శకాలను పాటించాలని ఆర్థిక శాఖ విశ్వవిద్యాలయాన్ని ఆదేశించింది. ఖాళీలను భర్తీ చేయడానికిఇ తక్షణ నియామకాల కోసం విశ్వవిద్యాలయం ఇటీవల ప్రభుత్వాన్ని సంప్రదించింది. కొత్త వ్యవసాయ కళాశాలల స్థాపన, కొత్త కోర్సుల ప్రవేశం, అధునాతన కేంద్రాల ఏర్పాటు నేపథ్యంలో బోధనా సిబ్బందికి డిమాండ్ పెరిగింది. ఇక ఎంపిక ప్రక్రియలో అనవసర ప్రభావాను నివారించడానికి మౌఖిక ఇంటర్వ్యూలు లేకుండా, కేవలం రాత పరీక్షల ద్వారా మాత్రమే నియామకాలకు అనుమతి ఇవ్వాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలక మండలి ఇటీవల తెలంగాణ సర్కార్‌ను కోరింది. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ ప్రతిపాదనలను పరిశీంచి పోస్టుల భర్తీకి సుముఖత వ్యక్తం చేసింది.

అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ చేస్తే ఊరుకోను..

ప్రభుత్వంతోనైనా పోరాడుతా

జడ్పర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 21, ప్రభాతవార్త : నియోజకవర్గ సమస్యలపై ప్రభుత్వంతోనైనా కొట్లాడుతానని, అవసరమైతే యుద్ధం కూడా చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలో ఆయన శని వారం పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తన హయాంలో జడ్చర్ల నియోజకవర్గంలో భూకబ్జాలు, డబల్ రిజిస్ట్రేషన్లు, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు జరగనివ్వనని చెప్పారు. ఎవరైనా అధికారులు సహకరిస్తే సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. అధికార పార్టీలో ఉన్నా సరే ప్రజా సమస్యలపై ప్రభుత్వంతోనైనా కొట్లాడుతానన్నారు. ఇటీవలే అధికారులు లంచం తీసుకుంటూ పనులు చేస్తున్నారని, విరాసత్ చేయమని తాను ఫైల్ చెబితే కాలేదని అదే కార్యాలయంలో రూ. 15వేల లంచం తీసు కొని చేశారంటూ హాట్ కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే.

పౌల్ట్రీ దిగ్గజం స్నేహఫామ్స్‌పై ఐటీ దాడులు

తెలుగు రాష్ట్రాల్లో 16 చోట్ల ఏకకాలంలో సోదాలు

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: ప్రముఖ పౌల్ట్రీ, అగ్రి బిజినెస్ సంస్థ స్నేహ గ్రూప్‌పై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులు శని వారం దాడులు చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు కొనసాగాయి. హైదరాబాద్, విజయ వాడ నగరాల్లోని ప్రధాన కార్యాలయాలతో పాటు డైరెక్టర్ల నివాసాల్లోనూ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ లోని కొండాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న స్నేహ ఫామ్స్ కీలక రికార్డులను అధికారులు పరిశీలించి లెక్కల్లో తేడా కనిపించిన వా టిని జప్తు చేశారు. సంస్థ డైరెక్టర్లు రామ్‌రెడ్డి డెండి, వరుణ్‌రెడ్డి డెండి, స్నేహ డెండిల ఇళ్లలోనూ ఐటీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేబ ట్టాయి. 1982లో రామ్‌రెడ్డి చికెన్ మార్కెట్‌గా ప్రారంభమైన ఈ వ్యాపారం, 1994 నాటికి స్నేహ ఫామ్స్‌గా విస్తరించించడం తెలిసిందే. ప్రస్తుతం పౌల్ట్రీ బ్రీడింగ్, చికెన్ ప్రాసెసింగ్, పశువులదాణా రంగాలతోపాటు సఫల బ్రాండ్‌తో వంట నూనెల తయారీ విభాగంలోనూ ఈ సంస్థ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తెలంగాణలో గంటకు దాదాపు 12,000 కోళ్లను ప్రాసెస్ చేసే భారీ సామర్థం కలిగిన అధునాతన ఆటోమేటెడ్ ప్లాంట్‌ను స్నేహ గ్రూప్ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో రెండువేల మందికిపైగా కాంట్రాక్ట్ రైతులతో కలిసి ఈ సంస్థ అనుసంధానమై పనిచేస్తోంది. పన్ను చెల్లింపుల్లో ఏవైనా అవకతవకలు జరిగాయా అన్న కోణంలో అధికారులు రికార్డులు, హార్డ్‌డిస్క్‌లు, బ్యాంకు ఖాతాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సోదాల సందర్భంగా కంపెనీ నిర్వాహకులను, అధికా రులను ఐటి అధికా రులు విచారించి వారి వాంగ్మూలం తీసుకున్నట్లు తెలిసింది.

ఉప్పల్ హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీలో పేలుడు

మహిళ మృతి.. కంపెనీ ముందు ఆందోళన

హైదరాబాద్ (ఉప్పల్), నవంబరు 21, ప్రభాతవార్త : ఉప్పల్ ఐడీఏ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌లో శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో డ్రమ్ ఒక్కసారిగా బలంగా పేలడంతో అందులో పనిచేస్తున్న కార్మికురాలు పింకీ దేవి(36) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ గాంధీనగర్‌లో నివాసముంటున్న పింకీ దేవి (35) హెరిటేజ్ ఫుడ్స్‌లో కార్మికురాలిగా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో క్రేట్ వాషర్ వద్ద వ్యర్థాలను పారవేసేందుకు మొదటి అంతస్తులోని డ్రమ్ ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా డ్రమ్ భారీ శబ్దంతో పేలడంతో పింకీ దేవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న సిబ్బంది మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు బీహార్‌కు చెందిన హరేంద్ర సాహా భార్య. ఆమెకు రీసు, ప్రిన్స్, క్రియాంశ్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న స్థానికులు, కార్మికులు హెరిటేజ్ కంపెనీ ఎదుట ఆందోళనకు దిగారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కంపెనీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నేతలు కంపెనీ గేటు ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ మద్యం బాధితుడు

కల్తీ మద్యం సేవించి 13 మంది మృతి


ఇంఫాల్, నవంబరు 21: మణిపూర్ లోని చందేల్ జిల్లాలో కల్తీ మద్యం తాగి అస్వస్థతకు గురైన వారిలో మరో ఇద్దరు మరణించారు. దాంతో మృతుల సంఖ్య 13కు పెరిగింది. ఈ నెల 18 నుంచి ఇప్పటివరకు కల్తీ మద్యం కారణంగా అనారోగ్యంపాలై మరణించిన వారి సంఖ్య కూడా 300కు పెరిగింది. వారంతా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది నుంగ్‌పన్, చక్‌పికరోంగ్ గ్రామాలు, వాటి సమీప ప్రాంతాలకు చెందినవారు ఉన్నారని అధికారులు తెలిపారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈనెల18న రాత్రి నుంగ్‌పాన్‌లో హ్రాంగ్‌బుంగ్ బెరుంగ్ అనల్ అనే 50 ఏళ్ల వ్యక్తి మరణంతో ఈ కల్తీ మద్యం మరణాలు మొదలయ్యాయి. ఆ తర్వాత గురు, శుక్రవారాల్లో చందేల్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో మరో 12 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్తగా చందేల్ జిల్లా యంత్రాంగం ప్రజారోగ్యం, భద్రత దృష్ట్యా ఏడు అంశాలతో కూడిన సూచనలను చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు స్థానికంగా తయారైన మద్యం తాగవద్దని ప్రజలను కోరింది.

భూమి చుట్టూ గ్రహ శకలం పరిభ్రమణం

బుడాపెస్ట్, నవంబరు 21: అంతరిక్షంలో ఓ అరు దైన ఘటన సంభవించింది. సాధారణంగా భూ మికి సమీపం నుంచి అస్టరాయిడ్లు దూసు కెళ్తుంటాయి. ఓ అస్టరాయిడ్ మాత్రం భూమి గురుత్వాకర్షణ శక్తికి లోనైంది. మనం గ్రహం చుట్టూ పరిభ్రమించడం మొదలుపెట్టింది. ఓ చిన్న గ్రహశకలం ఇది. అంతరిక్ష పరిశోధకులు దీనికి మినీమూన్‌గా భావిస్తున్నారు. 2026 క్యూక్యూ8 అని నామకరణం చేసిన ఈ చిన్న గ్రహశకలం కొద్ది నెలలపాటు భూమి కక్ష్య పరిధి లోనే సంచరించనుంది. హంగేరీలోని కొంకోలీ అబ్జర్వేటరీకి చెందిన ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త క్రిస్టియన్ సర్నెచ్కీ దీని ఉనికిని మొదట గుర్తిం చారు. ఈ యేడాది ఆగస్టు 20న దీని కదలికలపై ఆరా తీశారు. ప్రారంభంలో దీన్ని స్పేస్ జంక్ గా భావించారు. దాని పరిభ్రమణం విభిన్నంగా ఉండ టంతో మరింత లోతుగా అధ్యయనం చేశారు. హవాయ్ యూనివర్సిటీకి చెందిన 2.2 మీటర్ల టెలిస్కోప్, లోవెల్ డిస్కవరీ టెలిస్కోప్ సహా యంతో శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు.ఆ తర్వాత ఇంటర్నేషనల్ ఆస్ట్రానమికల్ యూనియన్ ఆధ్వర్యంలోని మైనర్ ప్లానెట్ సెంటర్ ఇది సహ జ గ్రహశకలమేనని అధికారి కంగా ధ్రువీకరిం చింది. ఈ గ్రహశకలం పరిమాణం పరంగా చాలా చిన్నది. దీని వ్యాసం ఒకటిరెండు మీటర్లే. ఓ చిన్న కారు పరిమాణంలో ఉంటుంది. పరిమాణం చిన్నది కావడం వల్ల దీని నుంచి భూమికి ఎలాం టి ప్రమాదం లేదని నిపుణులు స్పష్టం చేశారు. అతి స్వల్ప కాంతి కలిగి ఉండటం వల్ల సాధారణ కంటితో దీనిని చూడటం సాధ్యం కాదని

అంతరిక్షంలో 'మినీ మూన్'!

తేల్చారు. ఈ గ్రహశకలం సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి సుమారు 359 రోజుల సమయం తీసుకుంటుంది.చంద్రుడు ఓ స్థిర కక్ష్యలో ప్రయాణిస్తుంటాడనేది తెలిసిందే. 2026 క్యూక్యూ8 గ్రహశకలం ప్రయాణ మార్గం



దీనికి పూర్తి భిన్నం. ఓ నిర్దుష్ట ఆకారంలో తిరగట్లేదిది. లూప్ ఆకారంలో సంచరిస్తోంది. భూమి, సూర్యుడు ఈ రెండింటి గురుత్వాకర్షణ ప్రభావం దీనిపై నిరంతరం పడుతోండటం వల్ల ఓ దారి తెన్నూ ఉండట్లేదు. తాత్కాలికంగా భూమి గురుత్వాకర్షణ పరిధిలోకి రావడం వల్ల ఇది మన గ్రహం చుట్టూ పరిభ్రమిస్తోంది.ఈ గ్రహశకలం ప్రతి 10 సంవత్సరాలకొకసారి భూమి కక్ష్యా మార్గాన్ని దాటుకుని వెళ్తుంటుంది. ప్రతిసారీ ఇది భూమి గురుత్వాకర్షణ శక్తికి చిక్కుకోదు. అంతరిక్షంలో దాని ప్రయాణ వేగం, దిశ, భూమికి ఎంత దూరంలో ప్రయాణిస్తోందనే అంశాలపైనే ఇది ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం భూమి పరిధిలో ఉన్న ఈ గ్రహశకలం డిసెంబర్, జనవరి నాటికి భూమి గురుత్వాకర్షణ నుంచి బయటపడే అవకాశం ఉంది. అనంతరం తిరిగి సూర్యుడి చుట్టూ తన ప్రయాణాన్ని కొన సాగిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తోన్నారు. ఈ క్రమంలో ఈ అస్ట రాయిడ్ డిసెంబర్ 13న భూమికి అత్యంత సమీ పంలోకి రానుంది. ఆ సమయంలో ఇది భూమి నుంచి సుమారు 13.5 లక్షల కిలోమీటర్ల దూరంలో ప్రయాణి స్తుంది. ఈ దూరం భూమికి చంద్రుడికి మధ్య ఉన్న సగటు దూరం కంటే దాదాపు 3.5 రెట్లు ఎక్కువ. భూమికి ఓ తాత్కాలిక మినీ మూన్ లభించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా పలు గ్రహశకలాలు భూమి గురుత్వా కర్షణ పరిధిలోకి వచ్చి కొద్దిరోజుల ఇక్కడే సంచరిం చాయి. 2020 సీడీ3 అనే గ్రహశకలం దాదాపు మూడేళ్లపాటు భూమిచుట్టూ తిరిగింది. ఆ తర్వా త తన కక్ష్యను మార్చుకుని వెళ్లిపోయింది. అలాగే 2024 పీటీ5 అనే మరో చిన్న గ్రహశకలం 2024 సెప్టెంబర్ నుంచి నవంబర్ నెలల మధ్య కాలంలో కొన్నివారాల పాటు భూమికి ఉపగ్రహంగా మారింది.

సినీ పైరసీపై టిజిసిఎస్‌బి కొరడా

కొత్తగా విడుదలైన సినిమాలను థియేటర్‌లో రికార్డుచేసి ఆన్‌లైన్‌లో పంపిణీ చేస్తున్న నిందితుల అరెస్ట్

హైదరాబాద్ నవంబరు 21, ప్రభాతవార్త: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) సినీ పైరసీపై మరోసారి కొరడా జుళిపించింది. రెండేళ్ల క్రితం బప్పం టివి నిర్వాహకుడు ఐ బొమ్మ రవి అక్రమాలను రట్టుచేసిన టిజిసిఎస్‌బి తాజాగా కొత్తగా విడుదలైన సినిమాలను అక్రమ ంగా రికార్డు చేసి, పైరసీ వెబ్‌సైట్లు మరియు టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా ఆన్‌లైన్‌లో పంపిణీ చేస్తున్న ఇద్దరు నేరగాళ్లను అరెస్టు చేసింది. ఈ స ందర్భంగా వీరి వద్ద నుంచి పైరసికి వాడే కొంతసామాగ్రిని మూడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డై రక్టర్ శిఖా గోయల్ శనివారం మీడియాకు వెల్లడంచారు. రాష్ట్రంలో ఇటీవల విడుదలైన కొన్ని సినిమాలు పైరసీ వెబ్‌సైట్లు మరియు టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా ఆన్‌లైన్‌లో రావడం సంచలనం రేపడం తెలిసిందే. దీనిపై ఫిలిం ఛాంబర్ టిజిసిఎస్‌బికి ఫిర్యాదు చేయగా అధికారులు వెంటనే రంగంలో దిగి విచారణ చేబట్టారు. కర్నూలు జిల్లా సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ రిజ్వాన్ (19), ఇదే జిల్లాలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన రా ంపోగు అజయ్ (19)లు ఈ గోల్‌మాల్‌కు సూత్రధారులుగా తేలింది. నిందితులిద్దరు కర్నూలు, సిటీ స్క్వేర్ మాల్‌లో ఉన్న ఎస్‌వివి సినిమాస్ థియేటర్‌లో నూతనంగా విడుదలైన సినిమాలను మొబైల్ ఫోన్ల ద్వారా అక్రమంగా రికార్డు చేసి, ఆ వీడియోలను గో ఫైల్ .కాం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు తేలింది. ఈ కేసులో వున్న మరో ప్రధాన నిందితుడు టెలిగ్రామ్ ద్వారా వీరితో సంప్రదింపులు జరుపుతూ, రికార్డు చేసిన సి నిమాలను గో2 ఇండియా.4మూవిస్.క్లిక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్‌లో పంపిణీ చేసేలా సమన్వయం చేసుకున్నాడు. ప్రతీ సినిమాను అక్రమంగా రికార్డు చేసినందుకు వీరికి 20 వేల రూపాయలను క్రిప్టో కరెన్సీ రూపంలో చెల్లింపులు జరిగినట్లు తేలింది. అనంతరం ఆ మొత్తాన్ని భారత కరెన్సీగా మార్చుకున్నట్లు తేలింది. కాగా టిజిసిఎస్‌బి అధికారులు దీనిపై మరింత లోతుగా విచారించగా దీని వెనుక పెద్ద నెట్ వర్క్ వుందని తేలింది. నిందితులు తమ కార్యకలాపాలను దాచిపెట్టేందుకు నకిలీ గుర్తింపులు, వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగిస్తున్నట్లు కూడా నిర్ధారణ అయ్యింది. పైరసీ వెబ్‌సైట్లలో ప్రకటనలు, లింకుల ద్వారా ఆన్‌లైన్ గేమింగ్ మరియు బెట్టింగ్ అప్లికేషన్లను ప్రచారం చేస్తూ అక్రమ ఆదాయాన్ని పొందుతున్నట్లు వెల్లడైంది. నిందితులు క్రిప్టోకరెన్సీ రూపంలో కమీషన్లు స్వీకరిస్తున్నట్లు గుర్తించగా, ఈ ఆర్థిక లావాదేవీ లను గుర్తించేందుకు, ఇందులో భాగస్వాములైన ఇతర వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులు రామాయణం, సీన్, మ హాశక్తి, ఈఎన్ఈ, ఆకాశంలో ఒక తార, ఓం, కల్ట్, ఆదర్శ కుటుంబం సహా పలు సినిమాలను పైరసీ చేశారు.

హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడులు

హైదరాబాద్ నవంబరు 21, ప్రభాతవార్త: హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మరోసారి మెరుపు దాడులు నిర్వహించారు. శనివారం ఉద యం నగరంలోని పలు ప్రాంతాల్లో గల తొమ్మిది హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లలో టీజీ సేఫ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వినియోగ దారుల ఫిర్యాదులతో ఎనిమిది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టిన అధికారులు పలు చోట్ల అపరిశుభ్ర వంటశాలలు, బొద్దింకలు, ఎలుకల సంచరించడాన్ని గుర్తించారు. వెజ్, నాన్‌వెజ్ ఆహార పదార్థాలు కలిపి నిల్వ చేస్తున్నట్లు గుర్తించారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ లేకుండా నిర్వహి స్తున్న రెండు హోటళ్లను అధికారులు వెంటనే మూసివేశారు. ఆహార పదార్థాల నాణ్యతలో అనుమానం వున్న ఎనిమిది ఆహార నమూనాలు సేక రించారు. సుమారు 135 కిలోల ఆహార పదార్థాలు సీజ్ చేసి ధ్వంసం చేశారు. మరో నాలుగు రెస్టారుంట్ల ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్‌లు సస్పెం డ్ చేశారు. నాలుగింటికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రముఖ హోటల్ మెహఫిల్ రెస్టారెంట్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. సస్పెండ్ చేసిన హోటళ్లు, రెస్టారెంట్లను స్విగ్గీ, జొమాటోల నుంచి తొలగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు

టెలిగ్రామ్ ద్వారా మ్యూల్ ఖాతాల దందా

హైదరాబాద్‌లో యువకుడి అరెస్ట్

హైదరాబాద్ నవంబరు 21, ప్రభాతవార్త: మ్యూల్ ఖాతాల ద్వారా సైబర్ మోసాలకు సంబంధించిన డబ్బును మళ్లిస్తున్న ఓ గ్యాంగ్ గుట్టు రట్టయ్యింది. టెలిగ్రామ్ వేదికగా మ్యూల్ ఖాతాలను సేకరించి సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న కరీంనగర్‌కు చెందిన భూమేశ్ (25) అనే యు వకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేయగా ఈ దందా నడుపుతున్న కీలక సూత్రధారి అదరావేణి చందు పోలీసుల రాకకు సంబంధించిన సమాచారం అందుకుని పారిపోయాడు. భూమేశ్ అనే యువకుడు టెలిగ్రామ్ వేదికగా తనకు తెలిసిన వ్యక్తుల నుంచి డెబిట్ కార్డులను సేకరించి మ్యూల్ ఖాతాల ద్వారా డబ్బును విత్‌డ్రా చేసి సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా విత్‌డ్రా చేసిన డబ్బును భూమేశ్ కరీంనగర్‌కు చెందిన అదరావేణి చందు అనే వ్యక్తికి అందిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. చందు సూచనలతోనే డెబిట్ కార్డు లను సేకరించి, నగదును విత్‌డ్రా చేస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవీలు పూర్తయ్యాక డెబిట్ కా ర్డులను ధ్వంసం చేస్తున్నట్లు తేలింది. ఇప్పటివరకు 12 డెబిట్ కార్డులు సేకరించినట్లు నిందితుడు భూమేశ్ పోలీసుల విచారణలో వెల్లడించాడు. నిందితుడిని అరెస్టు చేసిన సైబర్ క్రైం పోలీసులు అతని వద్ద నుంచి ఐదు డెబిట్ కార్డులు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. భూమేష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచార ు. నిందితుడికి ఇతర సైబర్ నేరాలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అన్న కో ణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దందాలో సూత్రధారి అదరావేణి చందు పరారీలో ఉన్నడని అతని కోసం గాలింపు చర్య లు చేపట్టినట్లు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ విభాగము

కలెక్టర్ కార్యాలయం, కరీంనగర్
ఫారం - VI
(ప్రాథమిక ప్రకటన)

భూసేకరణ పునరావాస,పునఃస్థాపనలో పారదర్శకత మరియు నమ్మిక వష్టపరిహార హక్కు చట్టము-2013 (చట్టము-30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు నమ్మిక వష్టపరిహార నియమావళి-2014లోని నియమము 19(1) (ప్రకారం)

ప్రో.నెం. జి1/2099/2025 తేది: 28.10.2026

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టరు, కరీంనగర్ గారి ఆదేశానుసారము దిగువ నిర్దిష్ట పరిధిన కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలంలోని అలుగునూరు గ్రామ పరిధిలో ఎ.8.22గుం.ల భూమి LMD దిగువన మానేర్ నది ఎడమ వైపున కి.మీ. 1.100 నుండి కి.మీ. 3.700 వరకు కుడి వైపు రక్షణ గోడ నిర్మాణానికి మరియు కరీంనగర్ జిల్లా, కరీంనగర్ (అర్బన్) మండలం, కరీంనగర్ రెవెన్యూ గ్రామం పరిధిలో ఎ.2.36గుం.ల భూమి LMD దిగువన మానేర్ నది ఎడమ వైపున కి.మీ. 0.850 నుండి కి.మీ. 1.100 వరకు ఎడమ వైపు రక్షణ గోడ మరియు కాలువ నిర్మాణానికి, ఇట్టి మొత్తము భూమి విస్తీర్ణం ఎ.11.18గుం.ల తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టరు, కరీంనగర్ గారు ఇట్టి భూమి ప్రజా ప్రయోజనార్థమై అవసరమున్నదని భావిస్తున్నారు.

సదరు భూసేకరణ చట్టములోని సెక్షన్ 10-ఎ క్రింద ఇవ్వబడిన అధికారాల ఆపలంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఉత్తర్వు నెం. 03, ఐఅసిఐ (ఎల్.ఎ.), శాఖ, తేది: 02.02.2023 మరియు G.O.Ms.No.22 (తేది: 19.08.2026) ద్వారా LMD దిగువన ఎడమ మరియు కుడి వైపు గట్ల వెంబడి రక్షణ గోడల నిర్మాణం ఏర్పాటు చేయుటకు భూసేకరణ చట్టం, 2013 (నెం. 30/2013)లోని ఛాప్టర్-II & IIIలలోని నిబంధనల నుండి సామాజిక ప్రభావ అంచనా మినహాయింపు ఆదేశాలను జారీచేసినారు. కాబట్టి ప్రస్తుత భూసేకరణకు, భూసేకరణ చట్టం, 2013 (నెం.30/2013)లోని ఛాప్టర్-II & IIIలలోని నిబంధనల వినియోగ అనుసరించవలసిన అవసరము లేదు.

కలెక్టర్ కరీంనగర్ గారు RFCTLARR చట్టం, 2013లోని 43(1) & 3 (V) నిబంధనల ప్రకారం పునరావాసం మరియు పునఃస్థాపన విధులను నిర్వహించుటకై కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాజెక్ట్‌లలో భూములను సేకరించుటకై అదనపు కలెక్టర్, కరీంనగర్‌ను నిర్వాహకుడిగా నియమించారు.

పై ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ మసలను చేపట్టుటకు చట్టములోని నిబంధనల ననుసరించి జిల్లా కలెక్టర్, కరీంనగర్‌గారు ప్రత్యేక ఉప కలెక్టరు, భూసేకరణ మరియు R&R సీటిపారుదల ప్రాజెక్టులు కరీంనగర్ గారిని భూసేకరణ అధికారిగా నియమించడమైనది.

తమునుణంగా, జి.ఓ.యం.యస్.నెం.50 రెవెన్యూ (జే.ఎ & ఎల్.ఎ) డిపార్ట్‌మెంట్, తేది: 19.12.2014 క్రమముగా నంక్షమించిన అధికారాలను ఉపయోగించి, ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ మరియు ఆర్ & ఆర్, సీటి పారుదల ప్రాజెక్ట్ కరీంనగర్ వారి స్వాధీన పరిధిలోకి వచ్చే భూములకు సంబంధించి పునరావాసం మరియు పునఃస్థాపన చట్టం, 2013లోని సెక్షన్ 16(1) నుండి (6) వరకు మరియు నియమము 22(1) నుండి (5) వరకు ఉన్న నిబంధనల ప్రకారం పునరావాసం మరియు పునఃస్థాపన పథకాన్ని సిద్ధం చేయడానికి మరియు ప్రజా విచారణ నిర్వహించడానికి మరియు ముసాయిదా నివేదిక సమర్పించడానికి అధికారము ఇవ్వబడినది.

కావున కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అలుగునూరు గ్రామ పరిధిలో ఎ.8.22గుం.ల భూమి మరియు కరీంనగర్ (అర్బన్) మండలం, కరీంనగర్ రెవెన్యూ గ్రామం పరిధిలో ఎ.2.36గుం.ల భూమి మొత్తం భూమి విస్తీర్ణం (ఎ.11.18గుం.ల) భూమి యొక్క వివరములు ఈ క్రింది చూపిన భూసేకరణ మసల నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయునైది.

షెడ్యూల్

సర్వే నెం.	భూమి రకం (మెట్ట/తరి) & భూమి విధం (ప్రభుత్వ/ ఖాసా మొ.)	భూసేకరణ చేయు విస్తీర్ణం (ఎకరము. గుం.లలో)	పట్టాదారు(ల) పేరు (ల) తండ్రి / భర్త పేరుతో సహా	ఇతర వివరములు (నిర్మాణములు, చెట్లు, పగైరా)
1	2	3	4	5
తిమ్మాపూర్ మండలం- అలుగునూరు గ్రామం LMD దిగువన మానేర్ నది ఎడమ వైపున కి.మీ.1.100 నుండి కి.మీ. 3.700 వరకు కుడి వైపు రక్షణ గోడ నిర్మాణము కొరకు				
4	వట్టాతరి	0.10	ఆయిలాల నుయిల (రాధ కిష్టయ్య) దీక్షతుల మదన్ మోహన్‌రావు (కిషన్‌రావు)	-
5	వట్టాతరి	0.03	కాలువ అయిలయ్య (జోగయ్య) కంది విన్న లింగారెడ్డి (రంగారెడ్డి)	-
15	వట్టాతరి	0.09	అంటకాల అయిలమ్మ (బుచ్చిరెడ్డి)	
16	వట్టాతరి	0.10	వేల్పుల కొరయ్య (పీరయ్య) వేల్పుల పీరమ్మరి (కమరయ్య) భావనేతి తిరుపతి (మల్లయ్య) గుంటపల్లి లలిత (శ్రీనివాస్) జంగా శ్రీరామ్‌రెడ్డి (మంగల రాజిరెడ్డి) రమరి అజమ్ (పెంటయ్య)	-
17	వట్టాతరి	0.14	అంటకాల అయిలమ్మ (బుచ్చిరెడ్డి) మారం బోందయ్య (రాజయ్య) కంది లింగారెడ్డి (మల్లారెడ్డి) కంది శ్రీనివాస్‌రెడ్డి (మల్లారెడ్డి) నేరేళ్ల జంపయ్య (పర్వతాం) నూనె లక్ష్మయ్య (రాజయ్య) అనుగు రామారావు (మంగలరావు) గోపగోని తిరుపతి (అబ్బయ్య) గోలిరామ్‌రెడ్డి (మల్లారెడ్డి)	-
58	వట్టాతరి	1.04	జాప ప్రతాపరెడ్డి (రంగారెడ్డి)	-
448	వట్టాతరి	0.02	జాప వెంకటమల్లారెడ్డి (గోపాల్‌రెడ్డి) జాప స్వర్ణలత (వెంకటమల్లారెడ్డి)	-
449	వట్టాతరి	0.21	బుర్ర కనకయ్య (రాజయ్య) బుర్ర అనిల్‌కుమార్ (

ఎల్‌నినో కారణంగా వాతావరణ మార్పులవల్ల అసాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకే సంవత్సరంలో లేదా ఒకే రాష్ట్రంలో ఒక ప్రాంతం కరువుతో అలమటిస్తుంటే, మరో ప్రాంతం తుఫాను వర్షాలకు మునిగిపోవడం వంటి తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లో కురిసినబ్యాక్ టు బ్యాక్ తుఫాన్లు(అర్నబ్, మురాసు, అక్వాన్) తీవ్రమైన పంట నష్టాన్ని మిగిల్చాయి.అంతకుముందు నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నుంచి కోలుకోకముందే ఈ మూడు తుఫాన్లు వచ్చి పడటంతో రైతాంగం కోలుకోలేని దెబ్బతిన్నది. తుపాన్ల ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. తాగునీటి వెతలు, కరెంటు కష్టాలు, భూగర్భ జలాలు అడుగంటి పోవడం, అంతిమంగా మొదట ఎఫెక్టయ్యింది మాత్రం వ్యవసాయ రంగమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు ఐదుసార్లు కరువు పరిస్థితులు వచ్చాయి. ఆ వచ్చిన కరువుజనాలను పీడించగా,వ్యవసాయ రంగాన్ని తల్లడిల్లేలా చేసి రైతుల జీవితాలతో ఆడుకున్నాయి. తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా మొత్తం మూడుసార్లు కరవుపరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. తాజాగా ఈ సూపర్ ఎల్‌నినో కరవుతో కలిపి మొత్తం మూడు సార్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను ఆగమాగం చేశాయి.మరోపక్క ముఖ్యంగా 2026అక్టోబర్ చివరి నుండి నవంబర్ వరకు సంభవించిన తుఫాన్లు (అర్నబ్,మురసు,అక్వాన్) తెలంగాణలోని తూర్పుదక్షిణ జిల్లాలపై, ఆంధ్రప్రదేశ్‌లో కోస్తాజిల్లాలపై తీవ్రప్రభావం చూపింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో వచ్చిన తుఫాన్లు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లాయి. పెట్టుబడుల కోసం అప్పులు చేసి,పంట దిగుబడిపై ఆశలు పెట్టుకున్న రైతులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వరి, పత్తి, మిర్చి తదితర పంటలు పూర్తిగా పాడవ్వడంతో రైతులు ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది.

అన్నదాతను వణికిస్తున్న వరుస తుఫాన్లు

సిహెచ్.వి.వి.రఘుబాబు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలను ముఖ్యంగా రైతులను వర్షాభావ పరిస్థితులు, వరుస తుఫాన్లు అతలాకుతలం చేస్తున్నాయి. రోజుల వ్యవధిలోనే రాష్ట్రాన్ని ముంచెత్తిన అర్నబ్, మురసు, అక్వాన్ తుఫాన్లతో రైతుల కంటిపై కునుకు లేకుండాపోయింది. ఒక తుఫాను వస్తేనే ప్రజలు వణికిపోతారు. అలాంటిది మూడు వారాల వ్యవధిలో మూడు తుఫానులు. ఒకటి అర్నాబ్ తీరం దాటి బీభత్సం సృష్టించింది. రెండోది మురసు వెంటనే వచ్చి వర్షాలతో అతలాకుతలం చేసింది. తాజాగా మూడోది అక్వాన్ అంతకు మించిన తీవ్రతతో రెండు రాష్ట్రాలను వణికించింది. అయితే మూడో తీవ్ర తుఫాను ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీరం దాటడంతో తెలంగాణపై ప్రభావం లేకపోగా, కోస్తా ఆంధ్రాకు పెద్ద ముప్పు తప్పింది. ఖరీఫ్ పంటలు నాటినప్పటి నుండి ఎదిగేంత వరకూ తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతినగా, ఇప్పుడు చేతి కందివస్తున్న తరుణంలో వరుస తుఫాన్లతో మిగిలిన పంటలు నీటిపాలై రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి. ఆంధ్రప్రదేశ్‌లో మూడు తుఫాన్లతో మొత్తం అంచనా నష్టం ప్రాథమిక అంచనాల ప్రకారం రెండు తుఫాన్ల వల్ల సుమారు రూ.7,500 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ప్రభుత్వం అంచనా వేసింది. మురసు తుఫాను వల్ల ప్రాథమికంగా రూ.2,484 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిని సుమారు రూ.1,092 కోట్ల నష్టం కలిగింది. గోదావరి జిల్లాల్లో కొబ్బరి, అరటి తోటలతో పాటు ఇతర పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ఉమ్మడి జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో వ్యవసాయ రంగానికి భారీ దెబ్బ తగిలింది అర్నాబ్ తుఫాన్ ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, అనుబంధ ఉద్యాన పంటలు, మత్స్య పరిశ్రమకు తీవ్రనష్టం వాటిల్లింది. దాదాపు 7,62,500 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 55 వేల ఎకరాలకు పైగా ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా 4.6 లక్షల మందికి పైగా ప్రభావిత రైతులు నష్టపోయారు. ఇందులో వరి 5,23,650 ఎకరాలు దెబ్బతింది. ముఖ్యంగా పశ్చిమ గోదావరిలో 1,90,440 ఎకరాలు, కోనసీమలో 1,10,580 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 1,05,555 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పూర్తిగా నీట మునిగి నేలకొరిగింది. కోనసీమ, గోదావరి జిల్లాల్లో అరటి తోటలు, చెరకు, కొబ్బరి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ అర్నాబ్ తుఫాన్ వల్ల జరిగిన ప్రాథమిక నష్టం రూ.4,526 కోట్లుగా అంచనా



వేశారు. ఇక అర్నబ్ గాయం మానకముందే వారం తిరక్కుండానే మురాసు తుఫాన్ బీభత్సం సృష్టించింది. దీనివల్ల ఎపిలో ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపు 1,31,147.5 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా కృష్ణా,బాపట్ల, నంద్యాల, గుంటూరు జిల్లాలు అత్యంత దెబ్బతిన్నాయి. వరితో పాటు, పత్తి, మొక్కజొన్న, మిరప పంటలు నీట మునిగాయి. మురాసు వల్ల ఆస్తి, పంట నష్టం కలిపి రూ.344 కోట్లుగా అంచనా. తాజాగా అక్వాన్ తుఫాను దిశ మార్చుకుని దక్షిణ ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటడంతో ఆంధ్రప్రదేశ్‌కు భారీ ముప్పు తప్పింది, అయితే ఉత్తరాంధ్ర లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, లోతట్టు ప్రాంతాల ముంపు వంటి పరిమిత ప్రభావం మాత్రమే కనిపించింది. అక్వాన్ తుఫాను ప్రభావంతో పెద్దగా పంటలకు, ప్రాణనష్టం జరగ లేదు. అక్వాన్ తుఫాను బలహీనపడటం, దిశ మార్చుకోవడంతో రాష్ట్రంలో ఊహించినంత భారీ నష్టం జరగలేదు, ప్రాణనష్టం కూడా నమోదు కాలేదని నివేదికలు ఉన్నాయి. అయితే భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల ముంపునకు గురయ్యాయి. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, ఇతర తీర ప్రాంతాలను పలు లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో మునిగిపోయాయి. ఇక వరుస తుఫాన్లు తెలంగాణాను వణికించాయి. వ్యవసాయ, ఉద్యాన వన పంటలు, కోత దశకు వచ్చిన వరి, పత్తి, మిర్చి పంటలు నీట మునగడం, ఈదురుగాలులకు నేలవాలడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే సుమారు 34వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అరటి, బొప్పాయి వంటి ఉద్యానవన తోటలకు కూడా నష్టంజరిగింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నీటిపాలై నణ్యాత దెబ్బతింది. వరుస వర్షాల కారణంగా కల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయి రంగు మారడంతో రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లింది. అర్నబ్ తుఫాన్ తెలంగాణలోని పంటలపై పెద్ద ప్రభావం ఏమీ చూపించ లేదు. అయితే మురాసు తుఫాన్ ప్రభావం కూడా అంతంత మాత్రంగానే పంటలుపై పడింది. అక్వాన్ తుఫానుతో పలు చోట్ల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల వరి,కొబ్బరి, జీడి, పత్తి వంటి పంటలకు నష్టం వాటిల్లింది. భారీ వర్షాలతో వరి పంట నీటిపాలవగా, కొబ్బరి, జీడిచెట్లు నేలకూలాయి. తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు బీభత్సం సృష్టించాయి. పంట పొలాల్లో నీరు చేరింది. ఈదురు గాలులతో కూడిన వర్షాలకు వరి, పత్తి, మిర్చి వంటి నిల్వ ఉన్న పంటలు నేలమట్టమయ్యాయి. బలమైన గాలులతో కూడిన తుఫాను వర్షాల కారణంగా అనేక మండలాల్లో వివిధ పంటలు దెబ్బతినగా, కోత కోసిన చేలు తడిసిపోయాయి. చేతికి వచ్చిన వరి, పత్తి పంటలు నీట మునిగాయి. కోసి ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, మినుము పంటలతో పాటు, కాకర తదితర కూరగాయలు తదితర పంటలు ముంపునకు గురయ్యాయి. ఇదే సమయంలో వరద నీరు పొలాల గుండా ప్రవహించడంతో అనేక ప్రాంతాల్లో ఇసుక మేటలు ఏర్పడి సాగు భూములు దెబ్బతిన్నాయి. పందలాది వ్యవసాయ మోటార్లు, పొలాల్లో వేసిన డ్రిప్పు, ఇతర పరికరాలు వరదలకు కొట్టుకుపోయాయి. ఖమ్మం జిల్లాలో 20,450 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే అనధికారికంగా జిల్లాలో 25 వేల ఎకరాల్లో వరి, 50 వేల ఎకరాల్లో పత్తి, మరో 5 వేల ఎకరాల్లో మిర్చి, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందని అంచనా. అలాగే అక్వాన్ తుఫాన్ తెలంగాణ వైపు రాకపోవడంతో రాష్ట్రంలో ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగినట్లు ఎటువంటి అధికారిక నివేదికలు లేవు. కేవలం తూర్పు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురిశాయి.

గ్రౌండ్ రిపోర్ట్

ఎన్నికలు వస్తున్నాయంటే ముందుగా కనిపించేవి, వినిపించేవి 'యాత్ర'లే. పాదయాత్రలు, బస్సు యాత్రలు, రథ యాత్రలు.. ఇలా రకరకాల పేర్లతో తమ బలాన్ని అంచనా వేసుకొనేందుకు, కొత్త బలాన్ని సమీ కరించేందుకు నాయకులు యాత్రలు మొదలు పెడుతూంటారు. ఉత్తరప్రదేశ్‌లో కీలక నేత అయిన సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ కూడా గతవారం వినూత్న రీతిలో ప్రారంభించిన రథ యాత్ర ఇప్పుడు అందరి దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తోంది. లక్నో నుంచి రాయ్ బరేలి వరకు ఆయన నిర్వహిస్తున్న 'పిడిఎ రథయాత్ర' ఎన్నికలపై గణనీయ ప్రభావాన్నే చూపవచ్చనే అభిప్రాయమే వినిపిస్తోంది. పిడిఎ అంటే 'పిచ్ డా, దళిత్, అల్పసంఖ్యాక వర్గాల' రథయాత్ర. వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల ఓట్లు ఆకర్షించేందుకు అఖిలేష్ చేపట్టిన రథయాత్ర గోరఖ్ పూర్ నుంచి ప్రారంభించడం ఒక విశేషమైతే, దీనిని మహాభారత యుద్ధంగా అభివర్ణించడం మరోవిశేషం. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు బలమైన నియోజకవర్గం గోరఖ్ పూర్. ఆయన ముఖ్య మహంత్‌గా ఉన్న గోరక్షనాథ్ పీఠం ఈ నియోజకవర్గంలోనే ఉంది. గోరఖ్ పూర్ లోక్‌సభ స్థానం నుంచి 5 సార్లు ఎన్నికైన ఆదిత్యనాథ్‌కు పూర్వాంచల్, తూర్పు యుపిలోని దాదాపు 60 అసెంబ్లీ సెగ్మెంట్లలో తిరుగులేని ఆధిక్యత ఉంది. ఆ బలాన్ని కొల్లగొట్టడం కోసమే అఖిలేష్ రథయాత్ర అక్కడి నుంచి ప్రారంభించి ఉంటారు. ఆ 60 సీట్లలో కనీసం సగం గెలుచుకొంటే రాష్ట్రంలో అధికారం తేలికగా లభిస్తుందని ఆయన అభిప్రాయం. గోరఖ్ పూర్ అర్బన్ నుంచి సిఎం ఆదిత్యనాథ్ ఘనవిజయం సాధించడమే గాక ఆ ప్రాంతంలోని మెజారిటీ సీట్లు బిజెపి చేతిలోనే ఉన్నాయి.అందుకే వాటిపై పట్టు సాధించేందుకే అఖిలేష్ అక్కడి నుంచే రథయాత్ర ప్రారంభించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఏ వర్గాలపై అఖిలేష్ దృష్టి సారించారో, ఆ వర్గాలు గతంలో బిజెపికి మద్దతు ఇచ్చాయి. ఇప్పుడు అఖిలేష్ విసిరిన వల వాటి పైనే. కుల ప్రాతిపదికన ప్రజలను సమీకరించడం పార్టీలకు వెన్నతో పెట్టిన విద్య కనుకఅఖిలేష్ కూడా అదే బాట పట్టారు.ఇండియా కూటమిలో భాగస్వామి

'యాత్రా' స్పెషల్!

ఎ.వి.వి ప్రసాద్

ఉత్తర ప్రదేశ్

అయిన ఎస్పీ బిజెపితో పాటు కాంగ్రెస్ సీట్ల మీద కూడా కన్ను వేయడం గమనించవలసిన మరో అంశం. అఖిలేష్ యువజన విభాగాల అధ్యక్షుడుగా ఉన్నప్పటి నుంచి ఇటువంటి రథ యాత్రలే నిర్వహిస్తూ పార్టీ పురోగతికి పాటు పడుతున్నారు. 2002లో తొలిసారి రథయాత్ర నిర్వహించి సంచలనం సృష్టించిన ఆయన ఇప్పటిదాకా ఆరుసార్లు భారీ యాత్రలు నిర్వహించినట్లు చెబుతున్నారు.



అఖిలేష్ యాదవ్

2012 ఎన్నికల ముందు నిర్వహించిన 'క్రాంతి రథయాత్ర' అప్పట్లో ఎస్పీకి అధికారయోగం కలిగించింది. 2022 ఎన్నికల ముందు 'సమాజ్ వాదీ విజయ యాత్ర' నిర్వహించినా కొద్దిలో అవకాశం జారిపోయింది. ఆ ఎన్నికల్లో 32శాతం ఓట్లతో 111సీట్లు సొంతంగా సాధించింది. ఈ ఎన్నికల్లో 200 పైగా సీట్లు సాధించాలనే లక్ష్యంతో కదులుతోంది. మరో ప్రధాన పార్టీ అయిన బిఎస్పీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటుమాత్రమే లభించింది. అయితే ఓట్లశాతం 13దాకా ఉంది.తాజా సర్వేల ప్రకారం బిజెపికి41శాతం ఓట్లుస్థిరంగా ఉండగా, ఎస్పీ ఓట్లశాతం మాత్రం 32 నుంచి 33.6 శాతానికి పెరగవచ్చని తెలుస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ మెరుగైన ఫలితాలనే సాధించింది.ఆ ఎన్నికల్లో బిజెపి కంటే నాలుగు పార్లమెంటు సీట్లు ఎక్కువే వచ్చాయి. దానిని దృష్టిలో ఉంచుకొనే అఖిలేష్ ఈ సారి 'పిడిఎ' సూత్రం ఎంచుకొన్నట్లు కనిపిస్తోంది. వెనుకబడిన కుర్మీ, మోర్య, శాక్య, నిషాద, లోధ్ వర్గాల్లో ఎస్పీకిమద్దతు పెరిగినట్లుగా చెబుతున్నారు. అలాగే దళితులు, మైనారిటీల ఓట్లు కొల్లగొట్టడానికి అనువైన వ్యూహం అఖిలేష్ రూపొందించినట్లు కనిపిస్తోంది. బిఎస్పీకి మద్దతిస్తున్న మెజారిటీ దళితులు ఈసారి ఎస్పీ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.మాయావతి పార్టీలోని దళితుల ఓట్లు 35శాతం మేర ఎస్పీకి బదలీ అయితే సీట్ల అంకెలు భారీగానే మారుతాయి. ఇక ఎస్పీ కాంగ్రెస్ కూటమి దృఢంగాఉంటే మెజారిటీ సీట్ల సంఖ్యకు తేలికగానేచేరుకోవచ్చు. అయితే పరిస్థితులు అందుకు పూర్తి అనుకూలంగా ఉన్నాయా?అన్నది ఇప్పుడే చెప్పలేం.కాంగ్రెస్‌కు 2022లో 2శాతం ఓట్లు మాత్రమే ఉండగా, 24లో లోక్‌సభ ఎన్నికల నాటికి 9శాతానికి పెరిగాయి.కానీ ఎంపీసీట్ల పరిధిలోని అసెంబ్లీసెగ్మెంట్లలో కాంగ్రెస్ ఓడిపోవడంతో ఓట్ల శాతం ప్రస్తుతం నాలుగుకు మించిలేదని సర్వేలు చెబుతున్నాయి. అందువల్ల ఎస్పీకాంగ్రెస్ పొత్తువల్ల అదనంగా కలిగే ప్రయోజనం ఏదీ ఉండకపోవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. యాదవ ఓటర్లలో ఎస్పీకి అధిక మద్దతు ఉన్నా, ఆ ఓట్లను బిజెపి కూడా పెద్దసంఖ్యలోనే చీల్చే అవకాశాలు ఉన్నాయి.జనాభాలో యాదవులు దాదాపు పది శాతం ఉండగా మైనారిటీలు 20శాతం దాకా ఉన్నారు. ఆ ఓట్లలో అధికశాతం ఎస్పీకిలభించే సూచనలున్నాయి.వారి తర్వాత దాదాపు ఐదుశాతం ఉన్న కుర్మీల ఓట్లు అటు బిజెపి,ఇటు ఎస్పీకి సమానంగా లభించే అవకాశంఉంది. కుర్మీ వర్గంలోని అప్నా దళ్ బిజెపి కూటమిలో ఉంది. మిగిలిన వర్గాల్లో ఎస్పీఓట్లశాతం పెంచుకొంటే అధికారాన్ని చేరవచ్చు. ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి అంచనాలు మారిపోతాయి. ఇప్పటికైతే, సీట్లు పెరిగినా ఎస్పీకి అధికారం కష్టమనే అభిప్రాయం వినిపిస్తోంది. గతంలో కంటే భిన్నంగా, అధికారమే లక్ష్యంగా పొత్తులు కుదుర్చుకొనడానికి ఎస్పీ ఇప్పటికే ప్రయత్నాలు ఆరంభించింది. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు పూర్తయితే మిగిలిన పార్టీలతో పొత్తు వ్యవహారం కూడా ఖరారు కావచ్చు. ముఖ్యంగా మరో రెండు ప్రాంతీయ పార్టీలు ఎస్పీ కూటమిలోకి వచ్చే అవకాశం ఉంది. కొద్ది రోజుల్లో ఈ అంశంపై స్పష్టత లభించవచ్చునని తెలుస్తోంది.

గ్లోబ్

యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలని బ్రిటన్ నిర్ణయించుకుని దాదాపు పదేళ్లు గడిచిన నేపథ్యంలో, తాజాగా బ్రిటన్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన కీలక ఒప్పందాలు మళ్లీ ఐరోపాకూటమితో బ్రిటన్ చెలిమికి సిద్ధం అవుతున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒప్పందాలు ఇరుపక్షాల మధ్య ఆర్థిక, రాజకీయ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పడిన కీలక అడుగులుగా ఇరుపక్షాలు భావిస్తున్నాయి. దశాబ్దకాలంక్రితం బ్రిటన్ వేరుపడేందుకు ఏకంగా దేశవ్యాప్త రిఫరెండమ్‌ను నిర్వహించింది. దశలవారీగా రాజకీయసంక్షోభం ప్రభుత్వాలు కూడా మారి చివరకు లేబర్‌పార్టీకి పాలన బాధ్యతలు సంక్రమించాయి. బ్రిటన్‌లో ఏర్పడిన రాజకీయ మార్పులిప్పుడు ఆ దేశాన్ని మళ్లీ ఐరోపాకు చేరువచేస్తున్నాయా అన్నభావన సర్వత్రా వ్యక్తంఅవుతోంది. వ్యవసాయం, వాణిజ్యం, కర్బన ఉద్గారాల నియంత్రణ,యువతకుఉద్యోగ, నివాస అవకాశాలు వంటి అంశాలపై ఇరు పక్షాలు అంగీకారానికి రావడం, భవిష్యత్తులో మరింత ప్రతిష్టాత్మకమైన, చురుకైన భాగస్వామ్యాన్ని కొనసాగిస్తామని ప్రకటించడం చూస్తుంటే దాదాపు ఐదుగురు ప్రధానులు మారిన తర్వాత దశాబ్దకాలంలో మళ్లీ బ్రిటన్ ఐరోపా కూటమికి చేరువవుతున్నట్లుగానే స్పష్టం అవుతోంది. వారాంతంలో బ్రస్సెల్స్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశం అనంతరం సంయుక్త ప్రకటన ద్వారా ఈ ఒప్పందాలను వెల్లడించిన సమయంలో బ్రిటన్ ప్రధానమంత్రి ఆండీబర్న్‌హామ్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా పాల్గొన్నారు. బ్రిటన్ అధికారికంగా యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలిగిన సుదీర్ఘకాలం తర్వాత సంబంధాలను పునరుద్ధరించేందుకు చేపట్టిన అత్యంత కీలక ప్రయత్నాల్లో ఒకటిగా ఈ భేటీ నిలిచిందనే చెప్పుకోవాలి. అయితే కొన్ని క్లిష్టమైన అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మొక్కలు, జంతు ఉత్పత్తులపై తనిఖీలను తొలగించడం వల్ల బ్రిటన్, యూరోపియన్ దేశాల మధ్య వ్యవసాయ వాణిజ్యంమరింత సులభతరం అవుతుంది.దీనివల్ల వ్యాపార ఖర్చులు

బ్రిటన్

చెలిమికి మళ్లీ సై!

గన్ని మోహన్

తగ్గడంతోపాటు బ్రిటన్ ఎగుమతిదారులకు యూరప్ మార్కెట్లలో మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ఈ ఒప్పందాల వల్ల సాధారణ ప్రజలు, వ్యాపార సంస్థలకు ఒనగూరే ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనా లపైనే బిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్‌ఫోకస్ పెంచారు. యూరప్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగించడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, సూపర్ మార్కెట్లలో నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంటాయని, యువతకు ఉద్యోగ అవకాశాలుపెరుగుతాయన్నది ఆయన భావన. ఈ ఒప్పందాల ద్వారా బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు అదనంగా 0.5శాతం వృద్ధి లభించే అవకాశం ఉందని కూడా బ్రిటన్ లేబర్ ప్రధాని అంచనా వేశారు.గతంలో



ఆండీ బర్న్‌హామ్

ఈ అంచనాను 0.4శాతంగా పేర్కొన్నారు. ఈ ఒప్పందం బ్రిటన్‌కు మంచి రోజని, యూరప్‌కు కూడా మంచి రోజని వ్యాఖ్యానించడాన్ని చూస్తుంటే మళ్లీ ఐరోపాలో చేరేందుకు తహతహలాడుతున్నట్లు కనిపిస్తోంది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ ఈ ఒప్పందాన్ని ఇరు పక్షాల సంబంధాల్లో కీలక మలుపుగా అభివర్ణించారు. బ్రెగ్జిట్ తర్వాత కొనసాగుతున్న రాజకీయ, ఆర్థిక విభేదాలు ఉన్నప్పటికీ, లండన్‌తో నిర్మాణాత్మక సంబంధాలను కొనసా గించేందుకు బ్రస్సెల్స్ సిద్ధంగా ఉందని ఆమె సంకేతాలిచ్చారు. ఈఒప్పందంలో యువతకు సంబంధించిన అంశం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం బ్రిటన్‌కు చెందిన లక్షమంది యువత యూరోపియన్ యూనియన్ దేశాల్లోగరిష్ఠంగా మూడేళ్లపాటు నివసిస్తూ ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఉంటుంది.అదేవిధంగా యూరప్ దేశాలకు చెందిన మరో లక్ష మంది యువతకు బ్రిటన్‌లో నివసిస్తూ పనిచేసుకునే అవకాశంకలుగుతోంది. దీంతో ఇరు ప్రాంతాల యువతకు అంతర్జాతీయ అనుభవం, విద్య, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయి. యూరప్‌లో మారుతున్న భద్రతా పరిస్థితులు కూడా బ్రిటన్, యూరోపియన్ యూనియన్‌ను దగ్గర చేస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, యూరప్ సైనిక భద్రతపై పెరుగుతున్న ఆందోళనలు ఇరు పక్షాల మధ్య సమన్వయంఅవసరాన్ని మరింత పెంచాయి. బ్రెగ్జిట్ కారణంగా సంస్థాగతంగా విడిపోయినప్పటికీ, రక్షణ, భద్రతా రంగాల్లో కలిసి పనిచేయాల్సిన అవసరం ఏర్పడింది. బ్రస్సెల్స్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో రక్షణ, భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు అక్రమ వలసలను నియంత్రించే అంశాలపై కూడా చర్చించారు. బ్రిటన్, యూరోపియన్ యూనియన్ భద్రత, ఆర్థిక అభివృద్ధి పరస్పరం అనుసంధానమై ఉన్నాయని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాకూడా సమర్థించారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి, యూరప్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా స్థిరత్వాన్ని పెంపొందించడానికి మరింత సహకారం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఒప్పందాలు కుదిరినప్పటికీ ఇరు పక్షాల మధ్య రాజకీయ విశ్వాసం ఇంకా కీలక సవాలుగానే ఉంది.బ్రిటన్ మళ్లీ యూరోపియన్ యూనియన్‌లో చేరే అవకాశాలపై ఊహాగానాలు చేయడాన్ని యూరోపియన్ అధికారులు జాగ్రత్తగా చూస్తున్నారు. గత కొన్నేళ్లుగా బ్రిటన్‌లో ప్రధానమంత్రులు మారినప్పుడల్లావిధానాల్లో మార్పులు చోటుచేసుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.మొత్తంగా చూస్తే, బ్రెగ్జిట్ తర్వాత దూరమైన బ్రిటన్,యూరోపియన్ యూనియన్ మళ్లీ ఆర్థిక, రాజకీయ, రక్షణ రంగాల్లో దగ్గరవుతున్న సంకేతాలు తాజా ఒప్పందాల ద్వారా స్పష్టమవుతున్నాయి. అయితే ఈ ఒప్పందాలు ఎంతవరకు ఆచరణలోకి వస్తాయి, ఇరు పక్షాల సంబంధాలు ఏస్థాయికి చేరుకుంటాయన్నది భవిష్యత్తులో తేలాల్సి ఉంది.

ఎన్నికల వ్యవస్థలో మరో మజిలీ 'జమిలి'



సుంకవల్లి సత్తిరాజు

పార్లమెంటు సమావేశాలను సైతం పై చేసి,ప్రోరోగ్ చేయకపోవడం డీలిమిటేషన్‌తో కూడిన విమెన్ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించుకోవడానికే అనేవిషయం సుస్పష్టం. 131వ రాజ్యాంగ సవరణకు సంబంధించిన బిల్లు గతంలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధనలో విఫలమైన కారణంగా కీలకమైన డీలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించిన బిల్లు వీగిపోయింది. ఈకారణంగానే నియోజకవర్గాల పునర్వవస్థీకరణ అంశంతో ముడిపడిన మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన అంశం కూడా అటకెక్కిన విషయం విదితమే. అయితే ప్రస్తుతం మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో డి.ఎం.కె, ఎన్సీపీ లు డీలిమిటేషన్ కు అనుకూలంగా ఎన్డీఏ ప్రభుత్వానికి ఓటువేసే అవకాశ ముండడంతో కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఈ దిశగా పావులు కదుపుతున్నారు. ఈ సారి జరగబోయే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో తమ లక్ష్యాన్ని సఫలం చేసుకుని, 2029 లో జమిలీ ఎన్నికల వైపుఅడుగులు వేయడానికి ఎన్డీఏప్రయత్నిస్తున్నది. డీలిమిటేషన్, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంపుదల వంటి అంశాలపై చర్చలు సాగుతున్నా, అసలైన మజిలీ జమిలీ ఎన్నికలే. ఈ విషయంపై చర్చించే ముందు ఇతర అంశాలపై కూడా అధ్యయనం జరగాలి. భారత దేశాన్ని ప్రజలఆశలకు అనుగుణంగా అభివృద్ధి పథంలోముందుకు నడపాలంటే దేశానికి ప్రజాస్వామ్య విధానమే శ్రేయస్కరమని భావించి, ప్రజలెన్నుకున్న ప్రతినిధుల ద్వారా ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలనే ఆశయంతో ఎన్నికల వ్యవస్థను ఏర్పాటు చేసారు. ఆ క్రమంలోనే లోక్‌సభ ,రాష్ట్రాల శాసన సభలు ఏర్పడ్డాయి. ఓటుహక్కు ద్వారా చట్టసభలకు సభ్యులను ఎన్నుకునే ప్రజాస్వామ్య బద్ధమైన,చట్టబద్ధమైన ఎన్నికల రంగానికి పునాది పడింది. భారతదేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు 1951-52 సంవత్సరాల మధ్య కాలంలో 68 దశల్లో జరిగాయి. అప్పటికి దేశ జనాభా 36కోట్లు. అప్పటి నిబంధనల ప్రకారం 21 సంవత్సరాలు నిండిన ఓటర్ల సంఖ్య సుమారు 17 కోట్లు. అప్పట్లో ఓటు హక్కు గల పౌరుల్లో 80 శాతం పైగా నిరక్షరాస్యులే. 1957 సార్వత్రిక ఎన్నికల్లో 47శాతం మంది,1962లో సుమారు 55శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2014, 2019, 2024 సంవత్సరాల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 66 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.1952 వ సంవత్సరంలో తొలిసారి కొలువుదీరిన లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 489. ప్రస్తుతం ఈ సంఖ్య 543కు చేరింది. డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందితే, వచ్



శబరిమల యాత్రికులకు
సారన్ యాప్

పతనంతిట్ట,నవంబరు 21: శబరిమల యాత్రను మరింత సురక్షితంగా, సులభంగా, సౌకర్యవంతంగా చేయడానికి సారన్ అనే కొత్త డిజిటల్ ప్లాట్‌ఫాంను ప్రారంభించారు. స్థానిక స్వపరిపాలన శాఖ ఐటీ విభాగం అభివృద్ధి చేసిన ఈ ప్లాట్‌ఫాం, శబరిమల మార్గంలో ఉన్న విశ్రాంతి కేంద్రాలు, ప్రాథమిక సౌకర్యాలు ప్రయాణ ఏర్పాట్ల గురించి యాత్రికులకు ముఖ్యమైన సమాచారాన్ని అందిస్తుంది. స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి కె.ఎం.షాజీ ఈ అప్లికేషన్‌ను అధికారికంగా ప్రారంభించారు. విశ్రాంతి కేంద్రాలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ప్రయాణ వివరాలు స్థానిక ప్రకటనల గురించిన సమాచారాన్ని యాత్రికుల కోసం ఒకే వేదికపైకి తీసుకురావడమే సారన్ ప్రధాన లక్ష్యం. యాత్రికులు ప్రత్యేక అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేయవలసిన అవసరం లేదు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మొబైల్ బ్రౌజర్ ద్వారా నేరుగా దీనిని యాక్సెస్ చేయవచ్చు. సులభంగా యాక్సెస్ చేయడానికి వినియోగదారులు ఈ ప్లాట్‌ఫాంను తమ ఫోన్ హోమ్ స్క్రీన్‌కు కూడా జోడించుకోవచ్చు.సారన్ మలయాళం, ఇంగ్లిష్, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో అందుబాటులో ఉంది. వివిధ రాష్ట్రాలనుంచి వచ్చే యాత్రికులు అవరోధాలులేకుండాసమాచారాన్ని పొందగలుగుతారు.

రాహుల్ గాంధీకి కిరణ్ రిజిజు కౌంటర్

1962 యుద్ధం, పేదరికంపై కాంగ్రెస్‌కు 4 ప్రశ్నలు : ప్రపంచం ఎదుట దేశ ప్రతిష్టను దిగజారుస్తారా?



న్యూఢిల్లీ, నవంబరు 21: ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశంలో భారత్‌కు ప్రాతినిధ్యం లేకపోవడంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి నాలుగు ప్రశ్నలు సంధించారు. 1962లో చైనా చేతిలో ఎదురైన పరాభవానికి కాంగ్రెస్ క్షమాపణ చెబుతుందా? దేశాన్ని ఇన్నేళ్లు పేదరికంలో ఎందుకు ఉంచింది? అంటూ ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాల్సిన నాలుగు ప్రశ్నలను ప్రస్తావించారు.1962లో చైనా చేతిలో ఎదురైన పరాభవానికి కాంగ్రెస్ క్షమాపణ చెబుతుందా? చైనా ఆక్రమణకు గురైన ప్రాంతంలో తన గ్రామం కూడా ఉందని రిజిజు పేర్కొన్నారు. భారత్‌ను పేద దేశంగా ఎందుకు ఉంచారు? కాంగ్రెస్ పాలనలో దేశం పేదరికంలో కొనసాగడానికి కారణమేంటని ప్రశ్నించారు.భారత్‌ను 'పాములు ఆడించే దేశం'గా ఎందుకు చిత్రీకరించారు? ప్రపంచం ముందు దేశ ప్రతిష్ఠను అలా ఎందుకు చూపించారని నిలదీశారు.భారత ఆర్థిక వ్యవస్థను 'హిందూ వృద్ధి రేటు'గా ఎందుకు అవమానించారు? దేశ ఆర్థిక అభివృద్ధిని తక్కువ చేసి ఎందుకు మాట్లాడారని ప్రశ్నించారు.

రాహుల్ గాంధీ ఏమన్నారు?

చైనాలో జరిగిన ఎపిఇసి సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశంపై రాహుల్ గాంధీ స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే ఆ కీలక సమావేశంలో భారత ప్రధానమంత్రి కూడా పాల్గొని ఉండేవారని వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉంటే భారత ప్రధానమంత్రి కూడా ఆ సమావేశంలో కూర్చునేవారు. రాజీ పడిన ప్రధానమంత్రి ఎప్పటికీ ఆ సమావేశంలో కూర్చోలేరు' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. మోడీని ఉద్దేశించి 'రాజీ పడిన ప్రధాని' అని రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి.

మీడియాతో మాట్లాడిన కిరణ్ రిజిజు..

రాహుల్ గాంధీ భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. దేశంలో ఉన్నప్పుడు లేదా విదేశీ పర్యటనల్లో ఉన్నప్పుడు భారతదేశంపై విమర్శలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. విదేశాల్లో ఉన్న భారత్ వ్యతిరేక శక్తులతో రాహుల్ గాంధీ కలిసి పనిచేస్తున్నారంటూ రిజిజు ఆరోపించారు. భారత ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. భారత్ నాగరికత, సంప్రదాయాలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని బలహీనపరిచేలా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

మొదలైన మాటల యుద్ధం

రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో బిజెపి, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై రాహుల్‌కు అవగాహన లేదంటూ అధికార పార్టీ నేతలు విమర్శలు గుప్పించారు. ఇదిలా ఉండగా, చైనాలో జరిగిన త్రైపాక్షిక సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాహుల్ గాంధీ పానీయాలు అందిస్తున్నట్లుగా రూపొందించిన ఎఐ చిత్రాన్ని బిజెపి సోషల్ మీడియాలో షేర్ చేసింది. బిజెపి జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఈ చిత్రాన్ని ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'కుచ్ ఐసే' (ఇలాగే ఉండేది) అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నవ్వుతున్న, ఫైర్ ఎమోజీలను కూడా జత చేశారు.

సవాళ్లకే సవాల్ విసురుతా


ప్రధాని మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు



ఖర్గ్‌పూర్, నవంబరు 21: తాను సవాళ్లకే సవాలు విసిరే వ్యక్తినని, అలా చేయడాన్ని ఎప్పుడూ ఆపలేదని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. దేశ తొలి ఐఐటీ పశ్చిమ బెంగాల్లోని ఐఐటీ ఖర్గ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకలకు మోడీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధుల కోసం నిర్బంధ శిబిరం ఉన్న ప్రాంతంలోనే ఐఐటీ ఖర్గ్‌పూర్‌ను నిర్మించారు. 75 ఏళ్ల ప్రయాణంలో ఈ ఐఐటీ ఎన్నో మైలురాళ్లను చేరుకుంది. దేశాభివృద్ధిలో, ఆవిష్కరణ రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని తెలిపారు. గత 12 ఏళ్లలో ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరిచాం. పేద ప్రజలను శక్తిమంతం చేశాం. పేదరిక నిర్మూలన అంశం గతంలో ఎగ్రకోట వేదికగా ప్రసంగాలు, దల రూపకల్పనకే పరిమితమైంది. కానీ, గత 12-13 ఏళ్లలో 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని ఇటీవల ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. మా ప్రభుత్వ ప్రయత్నాల వల్లే ఇది సాధ్యమైంది. నేను సెమీకండక్టర్ మిషన్ గురించి మాట్లాడినప్పుడు.. చాలామంది ఆలస్యమైందన్నారు. ఇప్పుడు ఈ రంగంలో మనం ముందున్నాం. రాబోయే రెండు దశాబ్దాలు విద్యార్థులతోపాటు దేశానికీ ఎంతో కీలకమని మోడీ పేర్కొన్నారు. 1951లో స్థాపించిన ఐఐటీ ఖర్గ్‌పూర్‌కు ప్రధాని మోడీ రావడం ఇదే తొలిసారి. 75 ఏళ్ల వేడుక సందర్భంగా స్మారక వెండి నాణేన్ని ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు వికసిత్ భారత్ కార్యక్రమం కింద 75 మంది విద్యార్థులతో ముచ్చటించారు.

సింధు జలాలపై మారని భారత్ వైఖరి

పాక్ మంత్రి పర్యటనవేళ విదేశాంగ ప్రతినిధి వెల్లడి



న్యూఢిల్లీ, నవంబరు 21: భారత్‌పాకిస్థాన్ మధ్య సంబంధాల్లో సింధు జలాల ఒప్పందం ఎంతో కీలకం. ఈ ఒప్పందం విషయంలో భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. ఈ ఒప్పందంపై భారత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. షాంఘై సహకార సంస్థ నాగరికతల సంభాషణ వేదికలో పాల్గొనేందుకు పాకిస్థాన్ మంత్రి ముసాదిక్ మాలిక్ ఢిల్లీకి వచ్చిన నేపథ్యంలో భారత్ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్‌కు సింధు జలాల ఒప్పందంపై ప్రశ్న ఎదురైంది. పాకిస్థాన్ మంత్రి మాలిక్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో ఈ ఒప్పందంపై భారత్ వైఖరి ఏమిటని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా దీనికి స్పందించిన జైస్వాల్ సింధు జలాల ఒప్పందంపై భారత్ తన వైఖరిని ఇప్పటికే స్పష్టంగా ప్రకటించిందని, అందులో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. భారత వైఖరి ఇప్పటికీ అదే విధంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2025 ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి తర్వాత పాకిస్థాన్‌పై చర్యల్లో భాగంగా భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటి నుంచి ఈ ఒప్పందం విషయంలో భారత్ కఠిన వైఖరిని కొనసాగిస్తోంది. తాజాగా పాక్ మంత్రి ఢిల్లీ పర్యటన నేపథ్యంలోనూ కేంద్రం తన నిర్ణయంలో మార్పు లేదని స్పష్టం చేయడం గమనార్హం. ఎస్‌సీఓ నాగరికతల సంభాషణ వేదికలో పాల్గొనేందుకు పాకిస్థాన్ మంత్రి ముసాదిక్ మాలిక్ ఢిల్లీకి చేరుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిలా వేదికగా జరుగుతోంది. ప్రారంభ సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సును ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. అక్టోబర్ 28న భారత్ ఈ సదస్సుకు పాకిస్థాన్ సహా అన్ని ఎస్‌సీఓ సభ్య దేశాలకు ఆహ్వానాలు పంపినట్లు ప్రకటించింది. గత ఏడాది మే 7 నుంచి 10 వరకు ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ముసాదిక్ మాలిక్‌కు సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ ఆందోళనల గురించి ప్రశ్న ఎదురైంది. అయితే ఆయన నేరుగా సమాధానం చెప్పకుండా మరుసటి రోజు తాను ప్రకటన చేసిన తర్వాత ఈ అంశంపై మరింత చర్చించవచ్చని పేర్కొన్నారు. ప్రాంతీయ దేశాల మధ్య సంభాషణలు జరగడం ఎంతో ముఖ్యమని, ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో ఇలాంటి వేదికలు స్ఫూర్తినిచ్చదగినవని వ్యాఖ్యానించారు. భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశాలపై కూడా మాలిక్ స్పందించారు.

సోనియా మారుతి ఎండి ఎలా అయ్యారు?

న్యూఢిల్లీ,నవంబరు 21: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై భాజపా ఎంపీ నిషికాంత్ దూబె తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె విదేశీయురాలు అయినప్పటికీ గతంలో నిబంధనలు ఉల్లంఘించి మారుతీ ఎండీ అయ్యారని పేర్కొన్నారు. 1970 నాటి మారుతి ప్రాజెక్ట్‌కు సంబంధించి కంపెనీలో ఆమె యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఈ విషయంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నేతృత్వంలోని ప్రభుత్వం గాంధీ కుటుంబానికి అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ చీకటి అధ్యాయం అనే పేరుతో తన ఎక్స్ సిరీస్‌లో మాట్లాడుతూ నిషికాంత్ దూబె ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశీ పౌరురాలు అయినప్పటికీ, సోనియా మారుతికి మేనేజింగ్ డైరెక్టర్‌గా, 50శాతం వాటాదారుగా ఉన్నారని మీకు తెలుసా అప్పటి కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ విదేశీ పౌరుడూ భారతీయ కంపెనీకి డైరెక్టర్ కాకూడదు. 1970లో సోనియా గాంధీ మారుతి టెక్నికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీని స్థాపించారు.

సంక్షిప్త వార్తలు

పెరూలో భూకంపం: రిక్టర్‌స్కేలుపై 6.9 తీవ్రత

లిమా, నవంబరు 21: దక్షిణ అమెరికా దేశం పెరూలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.9 తీవ్రతతో భూమి కంపించింది. రాజధాని లిమాతోపాటు పలు ప్రాంతాల్లో భూకంప ప్రకంపనలు కనిపించాయి. భయాందోళనలకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. లిమాలోని పార్లమెంట్ భవనాన్ని అధికారులు ఖాళీ చేయించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. జర్మనీకి చెందిన జియోసైన్సెస్ రీసెర్చ్ సెంటర్ ఈ భూకంప తీవ్రతను 6.8గా నమోదు చేసింది.

అమెరికా ఎయిర్‌పోర్టులకు అల్‌ఖైదా ముప్పు!



వాషింగ్టన్, నవంబరు 21: అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థల నుంచి విమానయాన రంగానికి ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలతో అమెరికా భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. విమానాలు, విమానాశ్రయాలు, ఎయిర్ కార్గో కార్యకలాపాలపై దాడులు చేయాలంటూ ఉగ్రవాద అనుకూల వర్గాలు సందేశాలు ప్రచారం చేస్తున్నట్లు గుర్తించాయి. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీఐ, హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం, రవాణా భద్రతా సంస్థ సంయుక్తంగా హెచ్చరిక జారీ చేశాయి.

నూడుల్స్ తిని బాలిక మృతి, అక్క పరిస్థితి విషమం

జైపూర్, నవంబరు 21: రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన విషాదకర ఘటన కలవరపెడుతోంది. ఇంట్లోనే సరదాగా తయారుచేసుకుని నూడుల్స్ తిన్న ఏడేళ్ల చిన్నారి ప్రాణాలను కోల్పోయింది. ఆమె అక్క పరిస్థితి కూడా విషమంగా మారింది. జైపూర్‌లోని జోత్వర ప్రాంతం మంగళం సిటీలో నివసించే పీహూ కుమావత్ (7), ఆమె అక్క దివ్యాంశి గురువారం ఉదయం ఇంట్లోనే నూడుల్స్ తయారుచేసుకుని తిన్నారు. ఆ తర్వాత ఇద్దరూ నిద్రపోయారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి తిరిగివచ్చిన వారి తల్లి నిద్రపోతున్న పిల్లలను లేపేందుకు ప్రయత్నించింది. పెద్దమ్మాయి దివ్యాంశి నిద్రలేచింది కానీ, చిన్నారి పీహూలో ఎలాంటి కదలిక లేదు. దీంతో కంగారుపడిన కుటుంబసభ్యులు వెంటనే ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పీహూ (7) అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు.

ఎఫ్‌బిఐ డేటా కోసం సైబర్ హ్యాకర్ల చొరబాటు

న్యూయార్క్,నవంబరు 21: అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) సైబర్ భద్రతా వ్యవస్థలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా నేర పరిశోధనలు, అరెస్టు వారెంట్లు, నిందితుల గుర్తింపు వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని భద్రపరిచే ఎఫ్‌బీఐ కీలక విభాగం నేషనల్ క్రైమ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్‌సీఐసీ)లోకి హ్యాకర్లు చొరబడినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఏడాది సెప్టెంబరులో ఉద్యోగ నియామకాల పోర్టల్‌పై జరిగిన దాడి తర్వాత, తాజాగా కీలక డేటాబేస్ లక్ష్యంగా మారడం అమెరికా ప్రభుత్వ డిజిటల్ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

చైనా పర్యటనలో ట్రంప్ డ్యాన్స్



బీజింగ్,నవంబరు 21: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనదైన శైలిలో మరోసారి వార్తల్లో నిలిచారు. తన చైనా పర్యటనలో భాగంగా షెన్‌జెన్‌లో ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ సమక్షంలోనే డ్యాన్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తనకు ఎంతో ఇష్టమైన విలేజ్ పీపుల్ బృందం పాడిన వైఎంసీఏ పాటకు ట్రంప్ స్టెప్పులేశారు. ఆ సమయంలో జిన్‌పింగ్ ఆయన పక్కనే నిలబడి, ఎలాంటి హావభావాలు లేకుండా ట్రంప్ డ్యాన్స్‌ను చూస్తూ ఉండిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను శ్వేతసౌధం సలహాదారు మార్గో మార్టిన్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది.

వాస్తవాధీనరేఖవద్ద పాక్ యువకుడి అరెస్టు..!



శ్రీనగర్, నవంబరు 21: జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద పాకిస్థాన్‌కు చెందిన 20 ఏళ్ల యువకుడిని భద్రతా సిబ్బంది అరెస్ట్ చేశారు. ఆర్నియా సబ్‌సెక్టార్‌లోనిసాయి కలాన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. హరాపీర్ బ్రిడ్జి సమీపంలోని సాయి కలాన్ మోర్ వద్ద అతడిని గుర్తించారు. నిందితుడిని పాకిస్థాన్‌లోని లయ్యా జిల్లాకు చెందిన అవైస్ రజాగా గుర్తించారు. విచారణలో అతడు పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మొదట దారి తప్పి వచ్చానని, ఆ తర్వాత అనుకోకుండా సరిహద్దు దాటానని చెప్పినట్లు సమాచారం.



మ్యూజియంగా సోనియా ఇటలీ నివాసం!

రోమ్, నవంబరు 21: ఇటలీలో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ చిన్ననాటి ఇంటిని మ్యూజియంగా మార్చేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇటలీలో స్థిరపడిన సిక్కు వ్యాపారవేత్త సుఖ్‌దేవ్ సింగ్ కాంగ్ ఈ సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ఆరేళ్ల క్రితమే ఆయన ఈ ఇంటిని కొనుగోలు చేశారు. మ్యూజియంలో ప్రదర్శించేందుకు అవసరమైన వ్యక్తిగత వస్తువులు, పాత జ్ఞాపకాలను సేకరించేందుకు త్వరలోనే గాంధీ కుటుంబాన్ని కలవాలని ఆయన భావిస్తున్నారు. ఇటలీలోని విసెంజా ప్రావిన్స్‌కు చెందిన లూసియానా గ్రామంలో ఈ ఇల్లు ఉంది. బూడిద రంగు రాళ్లు, కాంక్రీట్‌తో నిర్మించిన ఈ భవనంలో మొత్తం ఆరు గదులు ఉన్నాయి. సోనియా గాంధీ 1946 డిసెంబర్ 9న ఇక్కడే జన్మించారని, చిన్ననాటి రోజులను అక్కడే గడిపారని 52 ఏళ్ల కాంగ్ తెలిపారు. ప్రస్తుతం దీనికి ఇండియన్ హౌస్ అని పేరు పెట్టారు. ఇంటిపై మువ్వన్నెల జెండాతో పాటు, బయట సోనియా గాంధీ జన్మస్థలం అని రాసి ఉన్న నేమ్‌ప్లేట్‌ను ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఎవరైనా చూడటానికి వస్తే సహాయం చేసేందుకు అక్కడ ఒక కేర్‌టేకర్‌ను సైతం నియమించారు.పంజాబ్‌లోని హోషి యార్‌పూర్ నుంచి 1992లో ఇటలీకి వలస వెళ్లిన కాంగ్, డైరీ ఫామ్‌లు, వ్యవసాయం, ఫ్యాక్టరీల్లో పనిచేసి వ్యాపారవేత్తగా ఎదిగారు. 2020లో తన భార్య, కుమార్తె పేర్ల మీద ఈ ఇంటిని కొనుగోలు చేశారు. ఆస్తి పన్నులతో కలిపి ఏటా దాదాపు 1,000 యూరోలను దీని నిర్వహణ కోసం ఖర్చు చేస్తున్నారు. గతంలో ఈ ఇంటిని అద్దెకు ఇవ్వాలని, లేదా గురుద్వారాగా మార్చాలంటూ పలు ఆఫర్లు వచ్చినా ఆయన కుటుంబం తిరస్కరించింది. సోనియా గాంధీ, ఆమె పుట్టింటి కుటుంబమైన ఖిమైనోఖి చారిత్రక జ్ఞాపకాలను పదిలంగా కాపాడటమే తమ ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాచీన నివాసాన్ని అత్యాధునిక మ్యూజియంగా తీర్చిదిద్దితే విదేశాల్లోని భారతీయులతో పాటు స్థానిక పర్యాటకులు భారీగా తరలివస్తారని కాంగ్ భావిస్తున్నారు. తద్వారా ఆ గ్రామీణ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు సైతం మేలు జరుగుతుందని చెప్పారు. త్వరలోనే సోనియా గాంధీతో పాటు ఆమె పిల్లలు రాహుల్, ప్రియాంకలను కలిసి ఫోటోలు, పత్రాలు, ఇతర జ్ఞాపికలను సేకరించాలని అనుకుంటున్నారు. సోనియా గాంధీ రాసిన తాజా జ్ఞాపకాల పుస్తకం విడుదలైన తర్వాత ఆమె చిన్ననాటి ఇటలీ జీవితంపై మళ్లీ అందరిలోనూ ఆసక్తి పెరిగింది. ఏదిఏమైనా సోనియా నివాసం మ్యూజియంగా మారే అవకాశం ఉందనే ప్రచారం ఊపందుకుంది.

కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు నవ్వు తెప్పిస్తుంటాయి

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



న్యూఢిల్లీ,నవంబరు 21: భారతదేశ చరిత్రను ఎప్పుడు రాసినా 2014-2026 మధ్య కాలంలో ఈశాన్య ప్రాంతాల అభివృద్ధిని సువర్ణాక్షరాలతో లిఖిస్తారని హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతానికి మోడీ ప్రభుత్వం ఏమి చేసిందని పార్లమెంటులో కాంగ్రెస్ నాయకులు మాట్లాడే మాటలు నవ్వు తెప్పిస్తుంటాయన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో మౌలిక సదుపాయాల కల్పన, విమానాశ్రయాలు, రైల్వే కనెక్టివిటీతో ఈశాన్య ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. 11,200 మెగావాట్ల సామర్థం గల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రజల్లో ఉన్న ఆందోళనలను త్వరలో తొలగిస్తామన్నారు.ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, మతపరమైన నమ్మకాలకు ఎటువంటి భంగం కలగకుండా చూసుకుంటామన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటి నుంచి అక్కడ గణనీయమైన మార్పులు వచ్చాయని అమిత్ షా పేర్కొన్నారు. 35ఏళ్లకు పైగా అశాంతి, హింసాత్మక పరిస్థితులను చూసిన కశ్మీర్ లోయలో ప్రస్తుతం శాంతి నెలకొన్నదని తెలిపారు. ఇప్పుడు ఏ ఒక్క స్థానిక యువకుడికి ఉగ్రవాదంతో సంబంధం లేదన్నారు. కేవలం ఉగ్రవాదులను ఏరివేయడం ద్వారానే కాకుండా కశ్మీర్ యువతలో ఉన్న వివక్ష, పరాయీకరణ భావనలను అంతం చేయడం ద్వారా ఈ మార్పు సాధ్యమయ్యిందన్నారు. 2014 నుంచి ప్రధాని మోదీ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, శాశ్వత శాంతికి అవకాశాలను మరింత బలోపేతం చేశాయన్నారు.

హింసాత్మకంగా మారిన బంగ్లాదేశ్!



ఢాకా, నవంబరు 21: బంగ్లాదేశ్ మండిపోతోంది. షేక్ హసీనా డిసెంబర్‌లో స్వదేశానికి వెళ్తానని ప్రకటించడంతో ఆదేశంలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో బాంబు పేలుళ్లు, దహనాలు చోటుచేసుకున్నాయి. నరైన్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఈ వారం ప్రారంభంలో ఓ పార్టీ ర్యాలీపై జరిగిన దాడిలో అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేతలు మరణించారు. దీని తర్వాత 50కి పైగా ఇళ్లకు, పలు దుకాణాలకు దుండగులు నిప్పు పెట్టారు. షేక్ హసీనాకు చెందిన నిషేధిత అవామీ లీగ్ పార్టీ నేతలు, కార్యకర్తలకు చెందిన ఆస్తులనే టార్గెట్ చేస్తూ దహనాలకు పాల్పడ్డారు. కలియా మున్సిపాలిటీ పరిధిలోని బెండర్ చార్ గ్రామంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మాజీ అవామీలీగ్ ఎంపీ కబీరుల్ హక్ ముక్తికి చెందిన పూర్వీకుల ఇళ్లు కూడా దగ్ధమైంది. బంగ్లాదేశ్ రాజకీయాల్లో అవామీలీగ్, బీఎన్పీ మధ్య చాలా ఏళ్లుగా శత్రుత్వం ఉంది.

బంధువుల మధ్య వివాహాలపై
పిటిషన్ విచారణ

కొత్తచట్టం ఆవశ్యకతపై కేంద్రాన్ని వివరణ కోరిన సుప్రీం





న్యూఢిల్లీ, నవంబరు 21: దగ్గరి బంధువుల మధ్య జరిగే వివాహాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ తరహా వివాహాల వల్ల పుట్టబోయే పిల్లల ఆరోగ్యంపై పడే ప్రభావం దృష్ట్యా, కొత్త చట్టం తీసుకురావాల్సిన ఆవశ్యకతపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.ప్రభుత్వాన్ని ఆదేశించడం తమ ఉద్దేశం కాదని, కేవలం ఈ అంశంపై సున్నితంగా స్పందించేలా చేస్తున్నామని స్పష్టం చేసింది. బెంగళూరుకు చెందిన చార్వి ఎస్ అనే లా విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ స్వయంగా మేనరిక వివాహం ద్వారా జన్మించిన బిడ్డ కావడం, 40 శాతం దృష్టి లోపంతో బాధపడుతుండటం గమనార్హం. దగ్గరి బంధుత్వంలో పెళ్లిళ్ల వల్ల పుట్టబోయే పిల్లలకు నివారించదగిన జన్యుపరమైన హాని జరుగుతోందని, ఆచారం పేరుతో దీనిని కొనసాగించకూడదని ఆమె తన పిటిషన్‌లో వాదించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. సామాజిక సంస్కరణలకు సంబంధించిన చట్టాలను రూపొందించడం పూర్తిగా శాసనసభ పరిధిలోకి వస్తుందని, న్యాయస్థానాలు వాటిని నియంత్రించలేవని ధర్మాసనం అభిప్రాయపడింది. వివాహం అనేది వ్యక్తిగత ఎంపిక అని, దాని పరిణామాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర

కళా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకే కాళోజీ కళాక్షేత్రం

హనుమకొండ కలెక్టర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకార్థం నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకే కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారనే వార్తల నేపథ్యంలో సిఎం స్పం దించారు. కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి కళా క్షేత్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఖరారు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

ఆలయ భూముల్లో ఆయిల్‌పామ్

రాష్ట్రంలోని 28 వేల ఎకరాల్లో సాగు

మార్క్‌ఫెడ్‌కు లీజు ఇచ్చే ఆలోచన

భూముల పరిరక్షణ, అదనపు ఆదాయంపై దృష్టి

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: ఆయిల్ పామ్‌కు ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ సాగును విస్తరించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టిం. ఇందులో భాగంగా రాష్ట్రంలోని దేవాలయ భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు తాజాగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఆలయ భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేసినట్లయితే అటు అన్యాక్రాంతం అవుతున్న భూముల పరిరక్షణతో పాటు, అదనపు ఆదాయం వస్తుందనే దిశగా సర్కార్ ఆలోచన చేస్తోంది. వీటిని ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు ఈ భూములు అప్పగిస్తే విమర్శలు వస్తాయని భావించిన సర్కారు, ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్‌కు లీజుకు ఇవ్వడం ద్వారా రక్షణగా ఉంటుందని శాఖ భావిస్తోంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎండోమెంట్ భూముల్లో కూడా సాగుకు ప్రతిపాదనలు రూపొందిస్తోంది. అధికారుల వివరాల ప్రకారం తెలంగాణలో ఎండోమెంట్ పరిధిలో మొత్తం 91,827 ఎకరాల భూమి ఉంది. అందులో ఇప్పటికే 25 వేల ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ప్రభుత్వాల చర్యలతో 9,135.33 ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల పరిధిలో ఉన్న మరో 6 వేల ఎకరాలపై ఏం చేయాలనే దానిపై ఆలోచన చేస్తున్నారు. ఇక దేవాదాయశాఖ వద్ద ప్రస్తుతం 75,765.01 ఎకరాల భూమి ఉంది. ఇందులో 28,264.24 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చారు. అలాగే అర్చక పెన్షన్ల కింద 18,666 ఎకరాల భూమిని కేటాయించారు. ఇవి కాక ఇంకా 28,634.86 ఎకరాల భూమి ఉంది. ఆ ల్యాండులోనే ఆయిల్ పామ్ సాగుకు సిద్ధమవుతోంది. ఇందుకు గాను ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ద్వారా ఆక్రమణకు గురైన భూముల కబ్జాదారులకు నోటీసులు ఇవ్వాలని, కేసులు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

డిమాండ్ పడిపోవడంతో

థర్మల్ కేంద్రాల నిర్ణయం

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి తగ్గుదల

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: తెలంగాణలో ఉష్ణోగ్రతలు గత కొన్ని రోజులూ గరిష్ట స్థాయికి పడిపోవడంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌లో భారీ తగ్గుదల చోటు చేసుకుంది. ఇటీవల విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరగడంతో జనరేషన్ కార్పొరేషన్ రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తిని తగ్గించాలని సూచించినట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యుత్ అసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించే థర్మల్ పవర్ ప్లాంట్లు గత కొన్ని రోజులుగా తక్కువ సామర్థ్యంతో పనిచేస్తూ ఉత్పత్తిని తగ్గించినట్లు సమాచారం. పలు థర్మల్ యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. గత పదిహేను రోజుల వరకూ 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో పనిచేసిన థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఇప్పుడు రోజులో కొంత సమయం మాత్రమే నడుస్తున్నట్లు రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ అధికారవర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో విద్యుత్ వినియోగం తగ్గడం, బహిరంగ మార్కెట్లో విద్యుత్ తక్కువ ధరలకు లభించడంతో రాష్ట్ర ప్రభుత్వం సొంత విద్యుత్ ఉత్పత్తిని తగ్గించి కొనుగోళ్లకు అత్యంత ప్రాధాన్యత నిస్తోంది.ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు పవర్ ఎక్ఛేంజీలో రోజుకు సగటున 60 నుండి 83 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు పంపిణీ సంస్థల అధికారులు వెల్లడిస్తున్నారు.

రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్ల నుండి విద్యుత్ సరఫరా క్రమంగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా పగటి పూట విద్యుత్ ఉత్పత్తిని తగ్గిస్తూ , రాత్రి సమయంలో పెంచుతున్నట్లు వెల్లడైంది. ఈ నెల 2న పవర్ జనరేషన్ కార్పొరేషన్‌కు చెందిన థర్మల్ ప్లాంట్లు 108.30 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను సరఫరా చేశాయి. ఇది ఈ నెలలో నమోదైన అత్యధిక రోజువారీ ఉత్పత్తిగా నిలిచింది. తదుపరి విద్యుత్ ఉత్పత్తి తగ్గుదల చోటు చేసుకుంది.

ఈ నెల 16వ తేదీన రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్లు మరింత తగ్గించి 100.34 మిలియన్ యూనిట్లు చొప్పున విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి. కాగా రాష్ట్రంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్‌లో మరమ్మతు పనులు జరుగుతుండగా, కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్లులో 250 మెగావాట్ల సామర్థ్యం గత 10వ యూనిట్‌లోనూ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఇక యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని మూడవ యూనిట్‌కు కూడా మరమ్మతు పనులు చేస్తున్నారు. దీంతో మొత్తంగా రాష్ట్రంలోని ఆయా థర్మల్ యూనిట్లలో 2090 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామరథ్యంపై తీవ్ర ప్రభావం పడింది.

పోచంపల్లి ఇక్కత్ అల్లిక.. ఇప్పపూల తీపి

ఢిల్లీ వాణిజ్య మేళాలో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ

పెట్టుబడి సదస్సు వివరాలు, నమోదు కోసం పెవిలియన్‌లో స్టాండీలు

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త:పోచంపల్లి ఇక్కత్ నుంచి దేవరకొండ గిరిజన ఆభరణాల వరకు.. హైదరాబాద్ ముత్యాల నుంచి ఇప్పపూల లడ్డూల వరకు.. తెలంగాణలోని పలు ప్రాంతాల ప్రత్యేకతలు ఢిల్లీలో ఒకేచోట కనిపిస్తున్నాయి. భారత్ మండపంలో జరుగుతున్న 45వ భారత అంతర్జాతీయ వాణిజ్య మేళా (ఐఐటీఎఫ్)లో తెలంగాణ పెవిలియన్‌లోని చేనేత వస్త్రాలు, హస్తకళలు, సంప్రదాయ ఆహార ఉత్పత్తులపై సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. గద్వాల, నారాయణపేట చీరలు, వరంగల్ చేనేత తివాచీలు, కలంకారీ ఉత్పత్తులు, హైదరాబాద్ లక్క గాజులు పవిలియన్‌లో ఉన్నాయి. సంప్రదాయ ఇక్కత్ వస్త్రాలతో ఆధునిక శైలితో తయారు చేసిన బ్యాగులతో పాటు రాష్ట్రంలోని చిన్న పరిశ్రమల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.వికాస్ కౌర్ విరాసత్ (అభివృద్ధి, వారసత్వం) ఇతివృత్తంతో జరుగుతున్న ఈ యేడాది మేళాలో 11 దేశాల భాగస్వామ్యం ఉంది. 3,500 మందికి పైగా ప్రదర్శకులు పాల్గొంటున్నారు. స్థానికంగా ఉత్పత్తులు తయారు చేసే చేనేత కార్మికులకు, స్వయం సహాయక సంఘా లకు ఇతర ప్రాంతాల కొనుగోలు దారులను నేరుగా కలు సుకుని, కొత్త మార్కెట్లను అన్వేషించే అవకాశం ఈ మేళాతో లభిస్తోంది. ప్రదర్శన ఈ నెల 27 వరకు కొనసాగుతుంది. పెవి లియన్‌లో ఏర్పాటు చేసిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' సమాచార, నమోదు స్టాండీలు కూడా సందర్శకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. డిసెంబరు 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే సద స్సు వివరాలను వాటిపై ఉంచారు. ఆసక్తి ఉన్నవారు స్టాండీపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉచితంగా నమోదు చేసుకుంటున్నారు.



45వ భారత అంతర్జాతీయ వాణిజ్య మేళాలో తెలంగాణ పెవిలియన్‌లోని చేనేత వస్త్రాలు, హస్తకళలు, సంప్రదాయ ఆహార ఉత్పత్తులపై సందర్శకులు ఆసక్తి కనబరుస్తున్న దృశ్యం

వేసవి డిమాండ్‌కు కార్యాచరణ

రెవెన్యూ వసూళ్లు, మౌలిక సదుపాయాల కల్పన

దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:రానున్న వేసవి దృష్ట్యా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ ప్రణాళికను రూపొందిం చాలని ఆ సంస్థ సిఎండి జితేష్ పాటిల్ సూచించారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ వేసవి, వర్షాకాలంలో పనులను జనవరి చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. కొత్తగా సబ్‌స్టేషన్లు అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసే అవకాశాలు, నిధులు తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను నెల రోజుల్లో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. బిల్లుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకత, కచ్చితమైన డేటా నిర్వహణ కోసం ప్రతి విద్యుత్ సర్వీసును సంబంధిత డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ సంబంధిత ఫీడర్‌తో అనుసంధానించే మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని, నిరంతరం జాప్యం చేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండో దశలో చేపట్టిన 151 సబ్‌స్టేషన్లలో 121 పూర్తయ్యాయని, మిగిలిన 30 సబ్‌స్టేషన్ల పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్ల ప్రణాళికపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారులకు నెట్ మీటర్లను సకాలంలో అమర్చడం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కొత్త విద్యుత్ సర్వీసుల దరఖాస్తులను నిర్దేశించిన సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. కొత్త విద్యుత్ సర్వీసుల దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా విడుదల చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు, ఇరిగేషన్, ఈవాటర్ వర్క్స్ తదితర సంస్థల నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలను సమీక్షి ంచాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణకు ఆటోమేటిక్ మానిటరింగ్ వ్యవస్థల ఏర్పాటు సహా ఆధునిక సాంకేతిక పరిష్కారాలను పరిశీలించాలని, తద్వారా విద్యుత్ వృథాను అరికట్టి, ఇంధన పొదుపును ప్రోత్సహించాలని తెలిపారు. భూగర్భ జలాలపై రైతులకు శాస్త్రీయ అవగాహనగ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల లభ్యతను గుర్తించేందుకు గ్రౌండ్‌వాటర్ డిటెక్టర్ పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు.

డిసెంబరులో సింగరేణి పరిరక్షణ యాత్ర

విద్యుత్ బకాయిలు రూ.60 వేల కోట్లు చెల్లింపు

కార్మికుల సంక్షేమం, సంస్థ ప్రయోజనాలే ధ్యేయం

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: కార్మికుల సంక్షేమం. సంస్థ ప్రయోజనాలు, విద్యుత్ పంపిణీ సంస్థల నుండి రావాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సింగరేణి పరిరక్షణ యాత్రకు శ్రీకారం చుట్టనుంది. డిసెంబరు నెలలో ఈ పరిరక్షణ యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. ఈ యాత్రను ప్రారంభించే ముందు, సింగరేణి ప్రాంతాలలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించనున్నారు. సింగరేణి కార్యకలాపాలు నిర్వహిస్తున్న రాష్ట్రంలోని 11 ప్రాంతాలన్నింటినీ కవర్ చేస్తూ, ఈ పరిరక్షణ యాత్రను డిసెంబర్‌లో ప్రారంభిస్తామని సంఘం నాయకులు వెల్లడించారు.

ఈ యాత్ర సందర్భంగా, తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో), రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో) సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిల చెల్లింపు, వేలం ప్రక్రియ లేకుండా బొగ్గు గనుల కేటాయింపు, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, అంతర్గత తనిఖీలు వంటి సమస్యలను ఈ పరిరక్షణ యాత్రల్లో ప్రముఖంగా ప్రస్తావించనున్నారు. అలాగే 12వ వేతన సంఘం, కార్మికులకు 40 శాతం మధ్యంతర ఉపశమనం చెల్లింపు, 250 చదరపు గజాల భూమి కేటాయింపు, కార్మికులకు రూ. 20 లక్షల వడ్డీ లేని రుణం, 2026లో తొలగించబడిన వారితో సహా 2019 నుండి తొలగించబడిన కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవడం వంటి అంశాలపై కూడా దృష్టి సారించనున్నారు.

ఒక్కరోజే 3,300 మందికి సేవలు

తెలంగాణలో పాస్‌పోర్ట్ మేళా విజయవంతం

సాధారణ, తత్కాల్ పాస్‌పోర్టులతోపాటు పిసిసి సేవలు

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: తెలంగాణలో పాస్‌పోర్ట్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం (ఆర్‌పీఓ) శనివారం నిర్వహించిన ప్రత్యేక పాస్‌పోర్ట్ మేళా విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐదు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు (పీఎస్‌కేలు),అన్ని పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల (పీఓపీఎస్‌కేలు)లో ప్రత్యేకంగా అపాయింట్‌మెంట్లు అందుబాటులో ఉంచారు.ఈమేళా ద్వారా తెలంగాణవ్యాప్తంగా సుమారు 3,300 మంది దరఖాస్తుదారులు పాస్‌పోర్ట్, పాస్‌పోర్ట్‌కు సంబంధించిన వివిధ సేవలను పొందారు. సాధారణ పాస్‌పోర్ట్, తత్కాల్ పాస్‌పోర్ట్ దరఖాస్తులతోపాటు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) సేవలను కూడా అందించారు.పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా.. పాస్‌పోర్ట్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రత్యేక మేళాను నిర్వహించారు. ముఖ్యంగా సాధారణ, తత్కాల్ పాస్‌పోర్టులు, పీసీసీ సేవలకు అపాయింట్‌మెంట్ల కోసం ఎదురుచూసే సమయాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. పౌరులకు మెరుగైన సేవలు అందించడం, దరఖాస్తుదారుల సౌకర్యాన్ని పెంపొందించడం తమ ప్రాధాన్యత అని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం పేర్కొంది.

రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ట్రాన్స్‌కో సబ్‌ఇంజినీర్

హైదరాబాద్ నవంబరు 21, ప్రభాతవార్త:



లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ట్రాన్స్‌కో సబ్‌ఇంజినీర్ సంతోష్ ఆనంద్.

హైదరాబాద్‌లో లంచావతారుల ఆగడాలు ఆగడం లేదు. ఓవైపు అక్రమార్కులను ఎసిబి వరుసగా అ రెస్టు చేస్తున్నా మరోవైపు లంచాలు తీసుకునే వారి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. నగరంలోని గాంధీనగర్‌లో ట్రాన్స్‌కోకు చెందిన సబ్‌ఇంజినీర్ విద్యుత్ చౌర్యం కేసులో తదుపరి చర్యలు తీసు కోకుండా రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి దొరికిపోయాడు. శనివారం గాంధీనగర్ లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. గాంధీనగర్ సెక్షన్ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇంజినీర్ సంతోష్ ఆ నంద్ విద్యుత్ చౌర్యం కేసులో స్థానికంగా వుండే ఓ వ్యక్తిని కొంతకాలంగా 50 వేల రూపాయలు లంచం ఇవ్వాలని బెదిరిస్తున్నాడు. దీనిపై స దరు వ్యక్తి వేడుకోవడంతో 35 వేల రూపాయలకు తగ్గాడు. ఇందులో భాగంగా ఉదయం సబ్ ఇంజినీర్ కార్యాలయంలో బాధితుడు 30 వేల రూపాయలను తీసుకుని వెళ్లి సంతోష్ ఆనంద్‌కు ఇచ్చాడు. ఈ విషయాన్ని సమీపం నుంచి గమనిస్తున్న ఎసిబి అధికారులు వెంటనే దాడిచేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం నిందితుడి వద్ద నుంచి 30 వేల రూపాయల లంచం తాలూకు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. కాగా ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

పగటి కలలు కంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

స్క్రిప్ట్ బిఆర్ఎస్‌ది.. ప్రెజెంటేషన్ బిజెపిది

కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆట మొదలైందని.. రాబోయేది బీజేపీ ప్రభుత్వం అంటూ కిషన్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని వ్యాఖ్యానించారు. 'మీరు ఆట ఆడబట్టి 3 దశాబ్దాలు అయింది. ఇప్పటి వరకు ఒక్క గోల్ కొట్టిన దాఖలాలు లేవు. దేశంలో బత్తాయి ఆరెంజ్ కలర్‌లో ఉంటే.. తెలంగాణలో మాత్రం పింక్ కలర్‌లో ఉంటుంది' అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ డబ్బింగ్ చెబితే.. కిషన్‌రెడ్డి మాట్లాడుతారని, స్క్రిప్ట్ బిఆర్ఎస్‌ది ప్రజెంటేషన్ బీజేపీది అంటూ విమర్శలు గుప్పించారు. 'ప్రజలకు మీపైన ఏవిధమైన నమ్మకం ఉందని అధికారంలోకి వస్తారు. బీజేపీ స్టాండ్ ఏమిటి? కిషన్ రెడ్డి, బండి సంజయ్ ది ఏ లైన్? రాష్ట్రానికి అభివృద్ధి తెచ్చే లైనా? నిధులను రాకుండా అడ్డుకునే లైనా? తెలంగాణకు పెట్టుబడులు రావాలా.. వద్దా? మూసీ అభివృద్ధి జర గొద్దా? మూసీలోనే ప్రజలు మరిగిపోవలా? హైదరాబాద్ మెట్రోను విస్తరించొద్దా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్‌కు వచ్చే విదేశీయులకు వీసాలు క్యాన్సిల్ చేసినప్పుడు కిషన్‌రెడ్డి మాట్లాడ లేదని ఎంపి విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని, రాష్ట్రాన్ని బాగుచేయాలనే ఉద్దేశం తోనే ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్రం గురించి కేంద్రమంత్రికి ఏనాడైనా పట్టింపు ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణపై కిషన్ రెడ్డికి ప్రేమ లేదంటూ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భారత్ సమ్మిట్‌లో తెలంగాణకు సంబంధించిన ఎనిమిది ప్యానెల్ చర్చలు జరిగాయని, ఫ్యూచర్ సిటీకి సంబంధించి రూ.18,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికపై చర్చించామని వివరించారు.

డిసెంబర్ 7, 8 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్ ద్వారా మరిన్ని పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఢిల్లీలో జరిగిన తెలంగాణ రైజింగ్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హాజరై పెట్టుబడులపై మాట్లాడితే, తెలంగాణకు చెందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి నిధులు, పెట్టుబడులు తీసుకురావాలని హితవు పలికారు. తెలంగాణకు రావాల్సిన రీజినల్ రింగ్‌రోడ్, మెట్రో ఫేజ్2, మూసీ పునరుజ్జీవనం, పాల మూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, విభజన హామీలు, ఐఐఎం ఏర్పాటు వంటి అంశాలపై కిషన్‌రెడ్డి కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నిం చడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై మాట్లా డుతూ, రూ.21 వేల కోట్లకుపైగా వ్యయంతో 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు వంటి కార్యక్ర మాలను వివరించారు.

గోదావరి పుష్కరాలు-2027 లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పన పోటీకి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: గోదావరి పుష్కరాలు 2027 లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పన పోటీకి దేవాదాయ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 18 యేళ్ల నిండిన వ్యక్తులు, బృందాలు ఈ పోటీలో పాల్గొ నవచ్చు. లోగోతో పాటు ట్యాగ్‌లైన్‌ను తెలుగు లేదా ఆంగ్లం లేదా రెండు భాషల్లో సమర్పించాలి. పన్నెండేళ్లకోసారి జరిగే గోదావరి పుష్క రాలను 2027లో తెలంగాణలో గోదావరినది ప్రవహించే ఎనిమిది జిల్లాల్లో నిర్వహించనున్నారు. పోటీకి పంపే లోగో, ట్యాగ్‌లైన్‌లో గోదావరి నది ఆధ్యాత్మిక ప్రాధాన్యం, పుష్కరాల సంప్రదాయాలు ప్రతిబింబించాలి. లోగో సొంత సృజనతో రూపొందించినదై, వివిధ అవసరాలకు అనగా వెబ్‌సైట్లు, హోర్డింగులు, అన్నిరకాల ప్రకటనలు మొదలగు వాటికి అనువుగా ఉండాలి. ట్యాగ్‌లైన్ సంక్షి ప్తంగా, సులభంగా భక్తులను ఆకట్టుకునేలా ఉండాలి.

బహుమతులు:

ప్రథమ బహుమతి రూ.00,000, ద్వితీయ బహుమతి రూ.50,000, తృతీయ బహుమతి రూ.25,000. ముగ్గురు విజేతలతో సహా ఉత్తమ 100 ఎంట్రీలకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. దరఖాస్తులు 30 నవంబరు 2026 సాయంత్రం 5:00 గంటలలోపు శాఖకు చేరాలి. ఈమెయిల్ ద్వారా పంపవచ్చు. ముద్రిత ప్రతులను ఎం. హనుమంతరావు, సంచాలకులు/కమిషనర్, దేవాదాయ శాఖ, కమిషనర్ కార్యాలయం, దేవాదాయ శాఖ, బొగ్గులకుంట, తిలక్ రోడ్డు, హైదరాబాద్, తెలంగాణ 500001అనే చిరు నామాకు పంపాలి. పూర్తి మార్గదర్శకాలు, నిబంధనలు ఎండోమెంట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. ఇందుకోసం నియమించిన కమిటీ ఎంట్రీలను పరిశీలిస్తుంది. ఇతర భాషల్లోకి అనువదించిన రూపాలను కూడా శాఖ వినియోగించవచ్చు. విజేత ఎంట్రీలను అధికారికంగా వినియోగించినా, వినియోగించకపోయినా వారికి ప్రకటించిన నగదు బహుమతులు అందుతాయి. తెలంగాణ దేవాదాయ శాఖ, హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ సహ కారంతో, ఈ నెల 23వ తేదీ, సోమ వారం ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్‌లో ఉన్న జేఎన్ఏఎఫ్ఏయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో లోగో రూప కల్పన, ట్యాగ్‌లైన్, వాటి భావవివరణపై పోటీని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి అధికారిక లోగోను రూపొం దించడంలో జేఎన్ఏఎఫ్ఏయూ విద్యార్థులతో పాటు ఆసక్తిగల ఇతర ఔత్సాహికుల సృజనాత్మక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ పోటీ ఉద్దేశం. ఆసక్తి గల వారందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చునని దేవాదాయ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

హుజురాబాద్‌లో ఒక్క కొత్త పింఛను ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా

బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త:హుజురాబాద్‌లో సిఎం ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వలేదని, పైగా పాత పింఛన్లు 1029 తొలగించారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. తన నియోజకవర్గంలో ఒక్క కొత్త పింఛను ఇచ్చినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు. తన నియోజకవర్గంలో 1,029 పింఛన్లు తొలగించారని తెలిపారు. శనివారం తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. సిద్దిపేటలో రేవంత్‌రెడ్డికి డిపాజిట్ కూడా రాదన్నారు. రూ.100 కోట్లతో సిద్దిపేటలో సభ పెట్టి సాధించింది ఏంటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావని పేర్కొన్నారు. దేవుళ్లపై రేవంత్‌రెడ్డి ఒట్లు వేసి మాట తప్పడంతోనే రాష్ట్రంలో కరవు వచ్చిందని, తెలంగాణలో వర్షాలు పడకపోవడానికి కారణం రేవంత్‌రెడ్డే అంటూ కౌశిక్‌రెడ్డి విమర్శలు చేశారు.



మీడియాకు వివరాలు చెబుతున్న సికిందరాబాద్ జోన్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి

గాంధీ ఆస్పత్రి ఎదురుగా చిన్నారి కిడ్నాప్

కేసు ఛేదించిన పోలీసులు.. ఆరుగురు నిందితుల అరెస్

గిగ్ వర్కర్ల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం

చెక్కులు అందజేసిన మంత్రి వెంకటస్వామి

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త: విధి నిర్వహణలో మృతి చెందిన గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన హామీ మేరకు ఇద్దరు మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. స్విగ్గీ డెలివరీ వర్కర్ వల్లూరి సందీప్, ఉబర్ డ్రైవర్ అలుగోలా శ్యామ్ విధి నిర్వహణలో మృతి చెందడంతో వారి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ప్రకటించారు. రాహుల్ గాంధీ సభ రోజున బాధిత కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో వారి తరఫున ఇతర గిగ్ వర్కర్లు చెక్కులను స్వీకరించారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులు సచివాలయానికి స్వయంగా వచ్చి మంత్రి వివేక్ వెంకటస్వామి చెక్కులను అందుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, మంత్రి వివేక్ వెంకటస్వామి, రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల కుటుంబాల జీవనోపాధి కోసం ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నా రని, విధి నిర్వహణలో ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావించి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గిగ్ అండ్ ప్లాట ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని అరికడదాం

- యువత భవిష్యత్తును కాపాడడం అందరి బాధ్యత
- కుటుంబాల్లో క్రమశిక్షణ, మాఫియాపై కఠిన చర్యలు అవసరం
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, జయప్రకాశ్‌నారాయణ్, రామచందర్‌రావు, గౌతమ్‌రావు తదితరులు

హైదరాబాద్(జూబ్లీహిల్స్), నవంబరు 21, ప్రభాతవార్త: దేశ భవిష్యత్తుకు, యువత జీవితాలకు పెను ముప్పుగా మారుతున్న మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వాలతో పాటు ప్రతి కుటుంబం, విద్యా సంస్థ, సమాజంలోని ప్రముఖులు బాధ్యత తీసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహా రావు, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ పిలుపుని చ్చారు. డ్రగ్స్ సమస్యను కేవలం ప్రభుత్వా లు, పోలీసు వ్యవస్థలతోనే నిర్మూలించడం సాధ్యంకాదని, కుటుంబాల్లో చైతన్యం, పిల్లల్లో క్రమశిక్షణ, సమాజంలో బాధ్యతా యుతమైన మార్పు అవసరమని స్పష్టం చేశారు. మాదకద్రవ్య రహిత భారత్‌పై నగర సదస్సు, నషా ముక్త్ భారత్ కోసం పాద యాత్ర పేరుతో శనివారం శ్రీనగర్‌కాలనీ లోని సత్యసాయి నిగమాగమంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీజేపీ నేతల లక్ష్మణ్, గౌతం రావు తదితరులతో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశానికి యువతే అతిపెద్ద ఆస్తి అని, ప్రపంచ దేశాలు భారత యువ మేధస్సు, నైపుణ్యాల వైపు చూస్తున్నాయని అన్నారు. పెట్టుబడులు, ఐటీ, డేటా కేంద్రాలకు భారత్ సురక్షిత గమ్యస్థానంగా మారుతున్న తరుణంలో యువత డ్రగ్స్ బారినపడి నిర్వీర్యం కాకూడదన్నారు. గతంలో ఉగ్రవాద సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న పంజాబ్ ప్రస్తుతం డ్రగ్స్ మహమ్మారితో యువతను కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం హర్యానా, ఉత్తరప్రదేశ్ మీదుగా తెలుగు రాష్ట్రాలకు, హైదరాబాద్ బస్తీల నుంచి ఐటీ కారిడార్ల వరకు విస్తరిస్తోందని హెచ్చరించారు. ప్రతి కుటుంబంలోని తల్లి, ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుడు, ప్రతి బస్తీలోని ప్రముఖుడు డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.

తప్పులను ఉపేక్షించకూడదు

గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ.. పిల్లలపై తల్లిదండ్రులకు ఉండే అతిమమకారం వారి తప్పులను ఉపేక్షించేలా చేయకూడదన్నారు. పిల్లలు తప్పుదారి పడుతున్నప్పుడు కచ్చితంగా ఖినోఖి చెప్పగలిగే ధైర్యం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ఉండాలని సూచించారు. మద్యం సేవించడంతో మొదలయ్యే అలవాట్లు క్రమంగా మత్తు పదార్థాల వైపు మళ్లిస్తున్నాయని, పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడినట్లు తెలిసిన వెంటనే తల్లిదండ్రులు కఠినంగా స్పందించాలని చెప్పారు. చిన్నప్పటి నుంచే భక్తి, సంగీతం, సాహిత్యం వంటి మంచి అభిరుచులను అలవాటు చేయడంతో పాటు విద్యాసంస్థలు ర్యాంకులకే పరిమితం కాకుండా జీవిత విలువలు, క్రమశిక్షణ నేర్పాలని సూచించారు.

మాదక ద్రవ్యాలు ఓ వ్యసనం.. ఓ వ్యాధి

డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వ్యసనం ఒక వ్యాధిగా మారుతుందని, బాధిత యువతను నేరస్తులుగా చూడకుండా చికిత్స, కౌన్సెలింగ్ అందించాలని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే మాఫియా ముఠాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, వ్యసనానికి గురైన వారికి ప్రభుత్వమే అందుబాటులో డీఅడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా పురుషుల్లో మద్యం సేవించే వారి సగటు 22 శాతం కాగా, తెలంగాణలో 44శాతంగా ఉండటం ఆందోళనకరమన్నారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరం చేసేందుకు క్రీడలు, వ్యాయామం, సంగీతం, సాహిత్యం వంటి ఆరోగ్యకరమైన అభిరుచులను ప్రోత్సహించాలని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలనను రాజకీయ, కుల, మతాలకు అతీతమైన సామాజిక బాధ్యతగా గుర్తించి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ముగ్గురూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, సీనియర్ నేత లక్ష్మణ్, గౌతమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఒయులో రూ.480 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు

హైదరాబాద్, నవంబరు 21,ప్రభాతవార్త: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.480 కోట్లతో పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి టెండర్లు విడుదలయ్యాయి. బాలికలు, బాలుర హాస్టల్లు,కిచెన్,డైనింగ్ నిర్మాణానికి రూ.270 కోట్లు,అకడమిక్,నూతన డిపార్ట్‌మెంట్ల బ్లాక్, పరిశోధన,అభివృద్ధి బ్లాక్‌లను రూ.210 కోట్లు కేటాయించినట్లు వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం తెలిపారు. నిధులు కేటాయించిన సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సామ రామ్మోహన్‌రెడ్డి హామీ

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: యువత సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి హామీఇచ్చారు. శనివారం ఆయన సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణతో పాటు టిఎస్‌యుటిఎఫ్ స్టేట్ చీఫ్, ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి, జనరల్ సెక్రెటరీ వెంకట్‌లతో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యా రంగం బలోపేతంపై పలు కీలక అంశాలను ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై స్పందించిన సామ రామ్మోహన్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే శాసనమండలిలో యువత, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగుల గొంతుకనై పోరాడుతానని హామీ ఇచ్చారు.

భవిష్యత్ రహదారులపై విస్తృత చర్చలు

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త: భారత రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సి),సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సిఎస్‌ఐఆర్) సంయుక్తంగా రూపొందించిన రహదారుల పరిశోధనా నివేదిక శనివారం హైటెక్స్‌లో సాంకేతిక సమావేశం నిర్వహించారు. ఇందులో డిజిటల్ పరిశోధనా వేదికలు, పర్యావరణహిత నిర్మాణ పదార్థాలు, వంతెనల ఇంజినీరింగ్, రహదారి భద్రత, కృత్రిమ మేధస్సు, ఆధునిక రహదారి ప్రణాళికపై చర్చించారు.రహదారుల పరిశోధనకు సంబంధించి న వార్షిక నివేదికల ప్రచురణలో జాప్యాన్ని నివారించేందుకు సిఎస్ఐఆర్, సిఆర్ఆర్ఐ క్లౌడ్ ఆధారిత డిజిటల్ పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. దీని ద్వారా విద్యాసంస్థలు, నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టర్లు తమ ప్రాజెక్టులు, పరిశోధనా పత్రాలు, థీసిస్‌లను 5 నుంచి 10 నిమిషాల్లో అప్‌లోడ్ చేయవచ్చు. ఇప్పటికే 100కుపైగా పైలట్ ప్రాజెక్టులను ఇందులో పొందువరిచారు. భవిష్యత్తులో ఏడాదికి 1-2 లక్షల పరిశోధనా రికార్డులను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కృత్రిమ మేధస్సు ఆధారిత లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్‌ఎల్‌ఎం) ద్వారా పరిశోధనలను విశ్లేషించి, ప్రెజెంటేషన్లు, పిడిఎఫ్ నివేదికలను ఆటోమేటిక్‌గా రూపొందించే సదుపాయాన్ని కల్పించారు. భారతదేశం బిటు మెన్ అవసరాల్లో సుమారు 40 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో వ్యవసాయ వ్యర్థాల నుంచి బయోబైండర్ల తయారీపై పరిశోధ నలు చేపట్టారు.బయోఆయిల్‌ను బిటుమెన్‌లో 20-30 శాతం వరకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చు. పుదుచ్చేరిలో ఇప్పటికే వాణిజ్య ఉత్పత్తి ప్లాంట్ ప్రారంభమైంది. అలాగే, రీసైకిల్డ్ ఆస్ఫాల్ట్ పేవ్‌మెంట్ (ఆర్ఏపి)ను రహదారి నిర్మాణంలో 35-45 శాతం వరకు ఉపయోగించే ప్రయోగాలు విజయవంత మయ్యాయి. స్టీల్ స్లాగ్‌ను సంప్రదాయ కంకర రాళ్లకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో 6,000 కిలోమీటర్లకు పైగా ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డిఆర్) పనులు చేపట్టారు.

ఐటీ శాఖ మంత్రి పేరుతో భారీ మోసం

హైదరాబాద్,నవంబరు21,ప్రభాతవార్త: ఐటీ శాఖ మంత్రి ఓఎస్‌డీ పేరుతో భారీ మోసం వెలుగు చూసింది. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నిందితులు పలువురిని నమ్మించారు. బాధితుల నుంచి రూ.50 లక్షల వరకు కాజేశారు. ఈ మేరకు ఐటీ మంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో నకిలీ ఓఎస్‌డీపై పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కేసులోని నిందితులు నకిలీ ఓఎస్‌డీ ఐడీ కార్డు, ప్రభుత్వ నియామక ఉత్తర్వులతో నిరుద్యోగులను మోసం చేశారు. ప్రభుత్వ వెబ్‌సైట్లను పోలిన నకిలీ పోర్టల్స్ సృష్టించి అభ్యర్థులను నమ్మించారు. టీచర్, మున్సిపల్ అటెండర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాల పేరుతో వసూళ్లు చేశారు. ఉద్యోగాలు వస్తాయని నమ్మిన నలుగురు బాధితులు, వారు అడిగినంత సొమ్మును అప్పగించారు. ఇలా వీరి నుంచి రూ.50.87 లక్షలు వసూలు చేశారు. డబ్బులిచ్చి కాలం గడుస్తున్నా నిందితుల నుంచి స్పందన కరువవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు మంత్రి కార్యాలయాన్ని సందర్శించారు. జరిగిన విషయాన్ని కార్యాలయంలో వెల్లడిం చారు. అనంతరం నకిలీ ఓఎస్‌డీపై పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమెరికా ఎఫ్16 జెట్ కూల్చివేత

ఇరాన్ ఐఆర్జీసీ స్పష్టీకరణ

టెహ్రాన్,నవంబరు 21: ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి వద్ద ఇరు దేశాల మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన ఎఫ్16 యుద్ధ విమానాన్ని తమ వైమానిక రక్షణ వ్యవస్థలు లక్ష్యంగా చేసుకుని దాడిచేశామని ఇరాన్ ప్రకటించింది. శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ ఆధ్వరంలోని తస్నీమ్ వార్తా సంస్థ వెల్లడించింది. శనివారం ఇరాన్ సైన్యం ప్రకటన ప్రకారం పర్షియన్ గల్ఫ్ మీదుగా ప్రయాణిస్తున్న అమెరికా ఎఫ్16 జెట్‌ను దేశీయంగా అభివృద్ధి చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ గుర్తించినట్లు తెలిపింది. అమెరికా విమానాన్ని గుర్తించి, దాని కదలికల్ని నిరంతరం పర్యవేక్షించామని ఇరాన్ ఆర్మీ పబ్లిక్ రిలేషన్స్ విభాగం వెల్లడించింది. విమానాన్ని టార్గెట్ చేసిన క్షిపణిని ప్రయోగించినట్లు తెలిపింది. ఈ క్షిపణి యుద్ధ విమానానికి సమీపంలో పేలిందని, దీంతో విమానం దెబ్బతిన్నట్లు చెప్పింది. దీంతో పైలట్ తన మిషన్‌ను మధ్యలో నిలిపేసి, సమీపంలోని వైమానిక స్థావరంలో అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది ఇరాన్ పేర్కొంది. ఇదిలా ఉంటే, ఇరాన్ వాదనల్ని అమెరికా సెంట్రల్ కమాండ్(సెంట్కామ్) తోసిపుచ్చింది. ఇరాన్ ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేసింది. మిడిల్ ఈస్ట్‌లో ఉన్న అమెరికా యుద్ధ విమానాలు సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. మరోవైపు, అమెరికాకు చెందిన ఎంక్యూ 9 రీపర్ డ్రోన్‌లను కూడా కూల్చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇప్పటివరకు మొత్తం 58 అమెరికా డ్రోన్లను ధ్వంసం చేశామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది.

బిజెపి గూటికి క్రికెటర్ యుజువేంద్ర చాహల్



న్యూఢిల్లీ, నవంబరు 21: ప్రముఖ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గంలో ఆయనను ప్రత్యేక ఆహ్వానితుడిగా పార్టీ నియమించింది. ఇటీవల చాహల్ బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు అమర్‌పాల్ మోర్యను కలిశారు. అనంతరం తనకు పార్టీలో స్థానం కల్పించడంపై సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. నాకు బీజేపీ కుటుంబంలో స్థానం, గౌరవం కల్పించిన గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా జీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ జీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు అమర్‌పాల్ మోర్య జీకి హృదయపూర్వక ధన్యవాదాలని చాహల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా నూతన జాతీయ పదాధికారుల నియామకాలను కూడా బీజేపీ ప్రకటించింది. అసోంకు చెందిన జోగెన్ మోహన్, ఒడిశాకు చెందిన మమతా మొహంతా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంగమ్ లాల్ గుప్తా, మహారాష్ట్రకు చెందిన బాబన్‌రావు రావోజీ చౌదరి, ఢిల్లీకి చెందిన సత్ ప్రకాశ్ రాణా, బీహార్‌కు చెందిన అర్జున్ సాహ్ని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంగీత బల్వంత్ బింద్‌లను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించింది. అదేవిధంగా ఢిల్లీకి చెందిన గజేంద్ర యాదవ్, కర్ణాటకకు చెందిన ప్రమోద్ మధ్వరాజ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లలిత్ చంద్రాకర్‌లకు జాతీయ ప్రధాన కార్యదర్శుల బాధ్యతలు అప్పగించింది. ఏడు రాష్ట్రాలకు చెందిన నాయకులను జాతీయ కార్యదర్శులుగా నియమించింది. వీరిలో గుజరాత్‌కు చెందిన దశరథ్‌జీ ఠాకూర్, తమిళనాడుకు చెందిన టీ వరథరాజన్, జార్ఖండ్‌కు చెందిన సంజీవ్ కుమార్, హర్యానాకు చెందిన సరితా జాంగిడ్, తెలంగాణకు చెందిన కడగంచి రమేష్, మధ్యప్రదేశ్‌కు చెందిన వైభవ్ పవార్, బీహార్‌కు చెందిన భీమ్ కుమార్ సాహు ఉన్నారు. వీరితో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 37 మందిని జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు పార్టీ వెల్లడించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు అమర్‌పాల్ మోర్య తెలిపారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. 1990లో జన్మించిన యుజ్వేంద్ర చాహల్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ లెగ్ స్పిన్నర్. క్రికెట్‌లో రాణించకముందు ఆయన పోటీ స్థాయి చెస్ క్రీడాకారుడిగా కూడా గుర్తింపు పొందారు. టీ20 క్రికెట్‌లో 400 వికెట్లు సాధించిన తొలి భారత బౌలర్‌గా చాహల్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో 25 పరుగులకు 6 వికెట్లు పడగొట్టడం ఆయన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్లకు చాహల్ ఆడారు.

చెక్‌బౌన్స్ కేసులపై లోక్ అదాలత్

హైదరాబాద్ నవంబరు 20, ప్రభాతవార్త: రాష్ట్రం లోని ఆయా ప్రాంతాల కోర్టుల్లో శనివారం నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం (చెక్‌బౌన్స్ కేసులు) పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఈ లోక్ అదాలత్‌లు జరిగాయి. ఈ లోక్ అదాలత్‌లు విజయవంతం కావడానికి రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో పాటు అన్ని జిల్లాల న్యాయ సేవాధి కార సంస్థలు సంయుక్తంగా కృషి చేశాయని రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నా టి లోక్ అదాలత్‌ల వల్ల రూ.39 కోట్ల 89 లక్షల 46 వేలకు సంబంధించిన లావాదేవీలు పరిష్కారం అయ్యాయని ఆయన తెలిపారు.

చురుగ్గా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు

మంత్రి పొన్నం ఇంట్లో కమిటీ నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని గుర్తింపు కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ కే. కేశవరావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్‌రెడ్డి, శ్యాం మోహన్ పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీ ఇప్పటికే వివిధ యూనివర్సిటీల ఉద్యమకా రులు, కళాకారులు, సబ్బండ వర్గాలతో సంప్రదింపులు జరిపింది. ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, జరిగిన పనుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. గుర్తింపు ప్రక్రియలో ఇంకా చేపట్టాల్సిన చర్యలు, వాటి పురోగతిపై కమిటీ సభ్యులు చర్చించారు.ఉద్యమకారుల గుర్తింపు కోసం ఏర్పాటు చేయనున్న వెబ్‌సైట్ ప్రస్తుత స్థితి, ఎప్పటిలోగా ప్రారంభించాలి, వెబ్‌సైట్ ఏర్పా టును వేగవంతంగా పూర్తి చేయడానికి తీసుకో వాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించిన వెబ్‌సైట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని విధాలుగా కృషి చేయాలని కమిటీ అభిప్రాయపడిందన్నారు. వెబ్‌సైట్ ఏర్పాటుపై తదుపరి పురోగతిని త్వరలోనే మరోసారి సమీక్షించి, వెబ్‌సైట్ ప్రారంభం, తదుపరి కార్యాచరణపై మరో ప్రకటన చేస్తామని కమిటీ సభ్యులు కీలక ప్రకటన చేశారు.

ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు చైనా సాయం



న్యూఢిల్లీ, నవంబరు 21: పహల్గాం ఉగ్రదాడుల తర్వాత పాకిస్తాన్ పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఆపరేషన్ లో భాగంగా భారత్.. తొలుత పాకిస్తాన్ తో పాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాద శిబిరాలను టార్గెట్ గా చేసుకుంది. అనంతరం పాకిస్తాన్ క్షిపణి రక్షణ వ్యవస్థలను, ఎయిర్ బేస్ లపైనా దాడులు చేసింది. దీంతో ఉక్కిరిబిక్కిరైన పాకిస్తాన్ కు చైనా, టర్కీ పరోక్ష సాయం అందించాయి. చైనా ఫైటర్ జెట్లను, టర్కీ డ్రోన్లను తీసుకుని పాకిస్తాన్ ఎదురుదాడులకు దిగింది. ఈ సమయంలో అమెరికా జోక్యంతో ఆపరేషన్ సింధూర్ కాస్తా కాల్పుల విరమణకు దారి తీసింది. అయితే దీని వెనుక ఏం జరిగిందో అమెరికా బయటపెట్టింది. గతేడాది ఆపరేషన్ సింధూర్ జరిగిన సమయంలో పాకిస్తాన్ కు చైనా అందించిన సాయం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకూ అర్థమైంది. ఇదే క్రమంలో అమెరికా కాంగ్రెస్ కు చెందిన కమిటీ తన తాజా నివేదికలో చైనా చర్య వెనుక ఉన్న అసలు కారణాన్ని బయటపెట్టింది. భారత్ ఎదుగుదలను అణచివేసే వ్యూహంలో భాగంగానే చైనా పాకిస్తాన్ కు ఈ సాయం చేసిందని వెల్లడించింది. భారత్‌ను అదుపులో ఉంచడానికి చైనా సరిహద్దుల వెంట సైనిక ఒత్తిడిని, పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షల్ని ఉపయోగిస్తోందని కూడా యూఎస్‌చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ తన నివేదికలో వెల్లడించింది. చైనా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగకుండానే, సంక్షోభ సమయంలో తన మిత్రదేశమైన పాకిస్తాన్‌ను ఎలా బలోపేతం చేయ గలదో ఆపరేషన్ సింధూర్ చూపించిందని తెలిపింది. ఇలాంటి చైనా ఎత్తుగడల్ని అడ్డుకోవాలంటే భారత్‌అమెరికా మధ్య లోతైన నిఘా, సముద్ర యాన, తయారీ రంగ సహకారం అవసరమని ఈ నివేదిక సూచించింది. ఆసియాలో చైనాను ఎదుర్కునే విషయంలో భారత్ కు ఉన్న ప్రాధాన్యతను ఈ నివేదిక మరోసారి గుర్తుచేసింది. అలాగే అమెరికా కూటమి వ్యవస్థకు బయట, ఆసియా ఖండంలో అనుకూల శక్తి సమతౌల్యతను సృష్టించగల కొన్ని శక్తుల్లో భారత్ కూడా ఒకటని ఈ నివేదిక తెలిపింది. చైనా ఉత్పాదక, సరఫరా గొలుసులకు భారత్ ఓ కీలక ప్రత్యామ్నాయంగా కూడా ఇది గుర్తించింది.

ఉత్తరప్రదేశ్‌లో సీట్ల సర్దుబాటు!

విజయం ఛాయం: అఖిలేష్ యాదవ్



లక్నోనవంబరు 21: ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ముందు సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తు అంశం కీలకంగా మారింది. యూపీలోని 403 స్థానాల్లో కాంగ్రెస్ 180కి పైగా సీట్లను కోరుతోంది. ఇదే సమయంలో ఎస్పీ 24 సీట్లను ఆఫర్ చేస్తోంది. దీంతో పొత్తు చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. ఇదిలా ఉంటే, పొత్తులపై శనివారం ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, సీట్ల పంపకంతో గెలుపు అవకా శాలకే ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. గతంలో కూడా ఆయన కాంగ్రెస్ ఖచ్చితంగా గెలుస్తుందనే అంచనాలు ఉంటేనే సీట్లు ఇస్తామనే విషయాన్ని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనే విషయంపై ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు

లక్నోలో నిర్వహించిన విలేకరులు సమావేశంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ సీట్ల పంపకానికి విజయమే ప్రాతిపదిక అవుతుందని స్పష్టం చేశారు. అంటే, ఏ నియోజకవర్గంలో ఎవరికి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సీట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.ఇదే సమయంలో ఎన్నికల సంఘంపై అఖిలేష్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కై పనిచేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని గుడ్డిగా నమ్మకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కొంత మంది ప్రభుత్వ అధికారులు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని, అలాంటి అధికారులు జాబితా సిద్ధం చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఓటర్ల జాబితాలో బీజేపీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. సీఎం యోగి ఆదిత

ఆట

భారత్ ఆసియా కప్‌కు అర్హత

మలేసియాతో డ్రా



కౌలాలంపూర్ (మలేసియా): ఏఎఫ్‌సి అండర్17 ఆసియా కప్ క్వాలిఫైయర్స్‌లో భారత జట్టు అజేయంగా నిలిచి టోర్నమెంట్‌లో స్థానం సంపాదించింది. నవంబర్ 20న కౌలాలంపూర్ ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిన గ్రూప్ ఇ మ్యాచ్‌లో మలేషియాతో 0-0తో డ్రా చేసుకుని జట్టు తమ ప్రయాణాన్ని ముగించింది. గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన ఈ జట్టు ఖండాంతర ఈవెంట్‌కు అర్హత సాధించింది. ఈ టోర్నమెంట్‌కు భారతదేశం అర్హత సాధించడం ఇది 11వ సారి.. వచ్చే మే నెలలో ఉజ్బెకిస్తాన్‌లో జరగనున్న క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన జట్లు, ఫీఫా అండర్17 ప్రపంచ కప్ 2027లో తమ స్థానాన్ని ఖరారు చేసుకుంటాయి. శనివారం నాటి డ్రాకు ముందు మూడు విజయాలు సాధించిన బ్లూ కోల్ట్స్, నాలుగు ఆటలలో 10 పాయింట్లతో గ్రూప్ నిలో అగ్రస్థానంలో నిలిచింది. తొమ్మిది మంది వేర్వేరు ఆటగాళ్ల ద్వారా 20 గోల్స్ సాధించి, భారత జట్టుకు ఇది అత్యధిక స్కోరు నమోదైన సీజన్‌గా నిలిచింది. జట్టు తరఫున కెప్టెన్ దల్లల్మువాన్ గాంగ్టే ఏడు గోల్స్ చేశాడు. ఆట ప్రారంభమైన ఐదు నిమిషాలకే మలేషియా స్ట్రైకర్ నూర్ హిషమ్ 20 గజాల దూరం నుంచి కొట్టిన షాట్ గోల్‌పోస్ట్‌కు తగిలింది. దీనికి భారత్ వెంటనే స్పందించింది. లామ్‌సాంగ్‌జువాలా కొట్టిన లాంగ్ ఓవర్‌హెడ్ లోబ్‌తో రాజ్ సింగ్ వాహెంగ్‌బామ్ బాక్స్‌లోకి దూసుకెళ్లాడు. అయితే, వాహెంగ్‌బామ్ బంతిని చేజార్చుకుని, గోల్‌పై షాట్ కొట్టే అవకాశాన్ని కోల్పోయాడు.

2వ హాకీ టెస్టులో పాయింట్లు పంచుకున్న భారత్, న్యూజిలాండ్



ఆక్లాండ్: ఆక్లాండ్‌లో శనివారం జరిగిన మూడు టెస్టుల్లో రెండవ టెస్టులో, కెప్టెన్ సంజయ్, అంగద్ సింగ్ గోల్స్ చేయడంతో భారత్, న్యూజిలాండ్‌తో పాయింట్లను పంచుకుంది.
5వ నిమిషంలో డిలాన్ థామస్ ఆతిథ్య జట్టును ఆధిక్యంలోకి తీసుకువెళ్లగా, 10 నిమిషాల తర్వాత అంగద్ ఫీల్డ్ గోల్‌తో భారత్ స్కోరును సమం చేసింది. నాలుగో క్వార్టర్ చివరి నిమిషాల్లో (56వ) సామ్ హిహా న్యూజిలాండ్‌కు మళ్లీ ఆధిక్యాన్ని అందించగా, సంజయ్ వెంటనే పెనాల్టీ కార్నర్ (57వ) ద్వారా స్కోరును సమం చేసి, భారత్ స్కోరును సమంగానే ఉంచాడు. ఆట జరుగుతున్న సమయంలో భారత ఆటగాళ్లు మూడు గ్రీన్ కార్డులు అందుకున్నారు. తొలి మ్యాచ్‌లో 3-2 తేడాతో విజయం సాధించిన భారత్, ఆదివారం ఇరు జట్లు చివరిసారిగా తలపడనున్న నేపథ్యంలో, ఈ పర్యటనను విజయంతో ముగించాలని చూస్తోంది. 1926లో భారత సైన్యానికి చెందిన హాకీ జట్టు ఆవోటెరోవాలో పర్యటించడంతో ప్రారంభమైన భారత్, న్యూజిలాండ్‌ల మధ్య 100 ఏళ్ల క్రీడా సంబంధాలకు గుర్తుగా శనివారం లాయిడ్ ఎల్స్‌మోర్ హాకీ స్టేడియంలో ఈ మ్యాచ్ జరిగింది.

న్యూజిలాండ్‌తో ముగిసిన మూడోరోజు ఆట

118 రన్స్ ఆధిక్యంలో టీమిండియా

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో టీమిండియా జోరు కొనసాగుతోంది. వెల్లింగ్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో భారత్ 118 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 125 ఓవర్లలో 4 వికెట్లకు 486 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(136) భారీ శతకంతో రాణించగా, యశస్వి జైస్వాల్(85), దేవదత్ పడిక్కల్(80), శుభ్‌మన్ గిల్(98) సెంచరీ మిస్ చేసుకున్నారు. నైట్‌వాచ్‌మన్ అన్షుల్ కాంబోజ్(0 నాటౌట్)తో కలిసి రిషభ్ పంత్(55 నాటౌట్) హాఫ్ సెంచరీతో క్రీజులో ఉన్నాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ, కైల్ జెమీసన్, జాకోబ్ డఫీ, నాథన్ స్మిత్ తలో వికెట్ తీసారు. ఇక 159/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్‌కు కేఎల్ రాహుల్, పడిక్కల్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేసి వేగంగా పరుగులు చేశారు. 98 బంతుల్లో పడిక్కల్ హాఫ్ సెంచరీ సాధించగా భారత్ 239/1 లంచ్ బ్రేక్‌వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే జాకోబ్ డఫీ బౌలింగ్‌లో క్విక్ సింగిల్ తీసిన కేఎల్ రాహుల్ 207 బంతుల్లో సెంచరీ సాధించాడు. సెంచరీ ముంగిట దేవదత్ పడిక్కల్ జేమీసన్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 165 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన గిల్‌తో కలిసి కేఎల్ రాహుల్ రెండో సెషన్‌ను ముగించాడు. దాంతో భారత్ భారత్ 344/2 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్ ఆరంభంలోనే కేఎల్ రాహుల్(136) నాథన్ స్మిత్ క్లీన్ బౌల్డ్ చేయగా, రిషభ్ పంత్‌తో కలిసి శుభ్‌మన్ గిల్ చెలరేగాడు. దూకుడుగా ఆడిన గిల్, పంత్ వేగంగా పరుగులు రాబట్టారు. శుభ్‌మన్ గిల్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా, రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ సాధించాడు. సెంచరీ దిశగా సాగిన శుభ్‌మన్ గిల్ ఆఖరి ఓవర్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యి సెంచరీ చేజార్చుకున్నాడు.









నేడు హైవోల్టేజ్ మ్యాచ్

ఇండియా, పాకిస్థాన్ మధ్య కీలక పోరు

దోహా (ఖతార్): క్రికెట్ అభిమానులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ఈ నెల 22న భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే హైవోల్టేజ్ పోరుకు రంగం సిద్ధమైంది. ఖతార్ రాజధాని దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఈ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో భాగంగా చిరకాల ప్రత్యర్థులు భారత్ ఏ, పాకిస్థాన్ ఏ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. గ్రూప్ బీ లో అగ్రస్థానం కోసం జరగనున్న ఈ మహాసంగ్రామంలో పోటాపోటీ పోరు జరగనుంది. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో నేపాల్‌ను 306 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసిన తిలక్ వర్మ సేన రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. అభిషేక్ శర్మ, రింకు సింగ్, వైభవ్ సూర్యవంశీ, హర్షిత్ రాణా వంటి పలువురు అంతర్జాతీయ స్థాపిత ఆటగాళ్లతో ఇండియా ఎ ఒక బలమైన జట్టును ఏర్పాటు చేసింది. మరోపక్క తన తొలి మ్యాచ్‌లో 61 పరుగుల తేడాతో విజయం సాధించిన పాకిస్థాన్ ఏ కూడా గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమైంది.
భారత్ ఎ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ఆయుష్ బదోని, రింకూ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), షాబాజ్ అహ్మద్, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, తనూష్ కొటియన్, హర్ష్ దూబే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), అర్ష్‌దీప్ ఖాన్
ఉండగా, పాకిస్థాన్ ఎ జట్టులో అబ్దుల్ సమద్ (కెప్టెన్), షాజైబ్ ఖాన్, హైదర్ అలీ, హసన్ నవాజ్, మాజ్ సదాకత్, రోహైల్ నజీర్ (వికెట్ కీపర్), డానిష్ అజీజ్, మహ్మద్ ఇమ్రాన్ రంధావా, మహ్మద్ హస్నైన్, అహ్మద్ దానియాల్, సుఫియాన్ ముఖీమ్, అలీ రజా, సాద్ మ సూద్, షమీల్ హుస్సేన్, ఫర్హాన్ యూసుఫ్ ఉన్నారు.

హాంగ్‌కాంగ్ ఓపెన్‌లో ఓటమితో సత్విక్-చిరాగ్, లక్ష్య నిష్క్రమణ

కౌలూన్: భారతదేశపు అగ్రశ్రేణి పురుషుల డబుల్స్ జోడి అయిన సత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి, వ్యక్తిగత విభాగంలో లక్ష్య సేన్ శనివారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఓటమి పాలైయ్యారు. సత్విక్, చిరాగ్ జోడీ మలేషియాకు చెందిన ఎనిమిదో సీడ్ జోడి మాన్ వీ చోంగ్-టీ కై వున్‌ల చేతిలో ఓడిపోయి హాంగ్ కాంగ్ ఓపెన్ 2026 నుండి నిష్క్రమించారు. మలేషియా ప్రత్యర్థులపై 4-1 హెడ్‌టుహెడ్ ఆధిక్యంతో మ్యాచ్‌లోకి ప్రవేశించినప్పటికీ, ఐదవ సీడ్ భారత ద్వయం 40 నిమిషాల పోరులో 18 -21, 19-21 తేడాతో ఓటమి చవిచూసింది. ఆరంభపు గేమ్ హోరాహోరీగా సాగింది. వరుస అద్భుతమైన ర్యాలీలతో మాన్ మరియు టీ 17-12 ఆధిక్యంలోకి వెళ్లారు. సత్విక్, చిరాగ్ పోరాడి, స్కోరును 17-17తో సమం చేశారు. అయితే, చివరి దశలలో మలేషియన్లు 21-18 తేడాతో ఆటను కైవసం చేసుకున్నారు. రెండవ గేమ్‌ను బలంగా ప్రారంభించిన భారత్ జోడీ 7-3 ఆధిక్యాన్ని సంపాదించారు. కానీ నెట్ వద్ద చేసిన పొరపాట్ల వల్ల మాన్, టీ కోలుకుని స్కోరును సమం చేశారు. ఆ తర్వాత మలేషియా జోడీ గేమ్‌ను 21-19 తేడాతో ముగించి, ఫైనల్‌లో తమ స్థానాన్ని సురక్షితం చేసుకుంది. ఇక 42 నిమిషాల పాటు జరిగిన సెమీఫైనల్ పోరులో, భారత షట్లర్ లక్ష్య సేన్ డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ నంబర్ 3 ఆండర్స్ ఆంటోన్సెన్ చేతిలో వరుస గేమ్‌లలో (13-21, 13-21) ఓడిపోయాడు. ఆంటోన్సెన్, సెన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. రెండవ గేమ్‌లో 2-1 ఆధిక్యంలోకి వెళ్ళిన తర్వాత కూడా లక్ష్య ఆధిక్యంలోకి రాలేదు.



భారత్‌ను చూసి నేర్చుకోండి

ఫెడ్ రిజర్వ్‌కు ట్రంప్ చురకలు



వాషింగ్టన్,నవంబరు 21: భారత ఆర్థిక వృద్ధి రేటును ఉదహరిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుఎస్ ఫెడరల్ రిజర్వ్ చూసి నేర్చుకోవాలని హితవుపలికారు భారత్‌లో తక్కువ వడ్డీ రేట్లతో జిడిపి 7 శాతంగా ఉందని, అదే తరహాలో అమెరికాలోనూ వడ్డీ రేట్లను తగ్గిస్తే తమ దేశ వృద్ధి రేటు ఏకంగా 14 నుంచి 20 శాతానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. నాలుగు రోజుల ఆసియా పర్యటన ముగించుకుని వాషింగ్టన్ చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం అమెరికా వృద్ధి రేటు 4 శాతంగా ఉందని ట్రంప్ తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత చౌకగా రుణాలు పొందే వెసులుబాటు తమ దేశానికి ఉండాలని స్పష్టం చేశారు. బలమైన ఆర్థిక గణాంకాలు నమోదైనప్పుడు దేశానికి క్రెడిట్ అర్హత పెరుగుతుందన్నారు. తక్కువ వడ్డీకే రుణాలు లభించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆర్థిక నివేదికలు బాగున్న సమయంలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచుతోందని ఆరోపించారు. సెంట్రల్ బ్యాంక్ రాజకీయంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆర్థిక పరిస్థితులు బాగున్నప్పుడు వడ్డీ రేట్లు తగ్గించిన మాజీ ఛైర్మన్ అలాన్ గ్రీన్‌స్పాన్‌ను ఈ సందర్భంగా ప్రశంసించారు. వడ్డీ రేట్లను ఒక శాతం తగ్గిస్తే జాతీయ రుణ చెల్లింపుల భారం నుంచి దాదాపు 650 బిలియన్ డాలర్ల మేర ఆదా అవుతుందని ట్రంప్ తెలిపారు. వేగవంతమైన వృద్ధి ద్వారా రుణాలను త్వరగా తీర్చవచ్చని అభిప్రాయపడ్డారు.
అధిక రుణ వ్యయాలు ఉన్నప్పటికీ ఉత్పాదక రంగం గత పదినెలలుగా వృద్ధిబాటలో ఉందన్నారు. కొత్త పరికరాల పెట్టుబడులు 21 శాతం పెరిగాయని చెప్పారు. టారిఫ్‌ల వల్లే కార్ల తయారీ సంస్థలు దేశంలో ఉత్పత్తిని పెంచుతున్నాయని చెప్పారు. ఆడీ 4 బిలియన్ డాలర్లు, టయోటా 5 బిలియన్ డాలర్ల ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. డెట్రాయిట్ లోని ఫోర్డ్ ప్లాంట్ సైతం నిరంతరాయంగా పనిచేస్తోందని తెలిపారు. నవంబర్ ప్రారంభం నుంచి ముడి చమురు ధరలు 20 శాతం మేర పడిపోయాయన్నారు. పెట్రోల్ ధరలు గ్యాలన్‌కు 60 సెంట్లు తగ్గాయని ట్రంప్ వెల్లడించారు.

స్టాక్ మార్కెట్లకు రూ.1.12 లక్షల కోట్ల పెట్టుబడులు



ముంబయి, నవంబరు 21: భారత స్టాక్ మార్కెట్ల లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) నిధుల వెల్లువ కొనసాగుతోంది. ఈ నవంబరు నెలలో ఇప్పటివరకు ఎఫ్ఐఐలు ఏకంగా రూ.1.12 లక్షల కోట్ల నికర పెట్టుబడులను కుమ్మరించారు. విదేశీ మూలధనం భారీగా తరలిరావడంతో మార్కెట్ రికవరీ నిలకడగా సాగుతోందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. మరోవైపు దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు దాదాపు రూ.61,787 కోట్ల మేర నికర విక్రయాలు జరిపారు. దేశీయ మార్కెట్లకు సంస్థాగత పెట్టుబడులు బలమైన మద్దతుగా నిలుస్తున్నాయి. రూపాయి విలువ నిలకడగా పెరగడం సెంటిమెంట్‌ను బలపరిచింది. బ్రెంట్ ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్ల దిశగా దిగిరావడం కూడా సానుకూలంగా మారింది. వీటికితోడు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు మార్కెట్ ర్యాలీకి ఊతమిచ్చాయి. ప్రధానంగా లార్జ్ క్యాప్ షేర్లలో కొనుగోళ్ల జోరు సూచీల వేగాన్ని మరింత పెంచింది. ఆసియా మార్కెట్లలో టెక్ రంగం తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. అయినప్పటికీ భారత మార్కెట్లు లాభాల్లో ముగియడం విశేషం. విదేశీ మదుపర్లు గ్లోబల్ ఎఐ ట్రేడింగ్ నుంచి బయటకు వస్తూ ప్రైవేట్ బ్యాంకుల వైపు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన లిక్విడిటీ, అందుబాటు ధరల్లో ఉండటంతో ప్రైవేట్ బ్యాంకింగ్ రంగం రికార్డు స్థాయి లాభాలను కొనసాగించింది. సాంప్రదాయ ఐటీ సేవలకు విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు సద్దుమణగడంతో భారత ఐటీ షేర్లకు మద్దతు లభించింది. బలపడుతున్న డాలర్, యూఎస్ ఫెడ్ వడ్డీరేట్ల పెంపు సంకేతాలు, చైనా డిమాండ్‌పై అనిశ్చితి కారణాలతో లోహ రంగం నష్టాల బాట పట్టింది. రాబోయే ద్రవ్యోల్బణం, 2027నాటి ఫెడ్ విధానాలను బట్టి భవిష్యత్తులో ఎఫ్ఐఐ పెట్టుబడుల్లో కొంత అప్రమత్తత కనిపించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ వారంలో నిఫ్టీ 50 సూచీ 1.12 శాతం లాభపడింది. సెన్సెక్స్ 1.08 శాతం పుంజుకుంది. బెంచ్‌మార్క్ సూచీలు వరుసగా నాలుగో వారం కూడా లాభాల బాటలోనే ముగిశాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రియల్టీ, ఐటీ రంగాలు ప్రధానంగా లాభపడగా మీడియా, మెటల్, ఎనర్జీ రంగాలు నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.66 శాతం పెరిగింది. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీ 0.13 శాతం మేర నష్టపోయింది.

వెండి ధరల్లో భారీ పతనం, 65 శాతం క్షీణత



రూ.2 లక్షల పెట్టుబడిపై రూ.1.29 లక్షల వరకు నష్టం

ముంబయి,నవంబరు 21: వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఈ యేడాది జనవరిలో నమోదైన రికార్డు గరిష్ఠ స్థాయితో పోలిస్తే ప్రస్తుతం దాదాపు 65 శాతం వరకు తగ్గాయి. దీంతో గరిష్ఠ ధరల వద్ద వెండిలో పెట్టుబడులు పెట్టిన వారికి భారీ నష్టాలు ఎదురయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో జనవరి 29న ఔన్సు వెండి ధర సుమారు 121 డాలర్ల రికార్డు స్థాయికి చేరింది. అయితే ప్రస్తుతం అది దాదాపు 42 డాలర్లకు పడిపోయింది. దేశీయ మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జనవరి చివరిలో కిలో వెండి ధర సుమారు రూ.4.2 లక్షల గరిష్ఠ స్థాయికి చేరగా, నవంబరు 21 నాటికి రూ.1.49 లక్షల నుంచి రూ.1.55 లక్షల మధ్యకు పడిపోయింది. దీంతో దేశీయ మార్కెట్‌లో వెండి ధరలు గరిష్ఠ స్థాయితో పోలిస్తే సుమారు 63 నుంచి 65 శాతం వరకు క్షీణించాయి. జనవరిలో గరిష్ఠధరవద్ద రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టిన వ్యక్తికి సుమారు 476 గ్రాముల వెండి లభించేది. ప్రస్తుత ధరల ప్రకారం ఆ వెండి విలువ కేవలం రూ.71 వేల నుంచి రూ.74 వేల వరకు మాత్రమే ఉంటుంది. అంటే పెట్టుబడిదారుడికి సుమారు రూ.1.26 లక్షల నుంచి రూ.1.29 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లవుతుంది.
వడ్డీ రేట్ల భయాలతో ఒత్తిడిఅమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నాయన్న అంచనాలు వెండి ధరల పతనానికి ప్రధాన కారణంగా మారుతున్నాయి. డిసెంబరు తర్వాత కూడా వడ్డీ రేట్లను పెంచే అవకాశాలపై మార్కెట్లు దృష్టి సారిస్తున్నాయి. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా బంగారం, వెండి ధరలు ఒత్తిడికి గురయ్యాయని కోటక్ నియోకు చెందిన కమోడిటీ రీసెర్చ్ విభాగం ఎవిపి కయ్నత్ చైన్వాలా తెలిపారు.
దీనివల్ల వడ్డీ ఆదాయం అందించని బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గుతోందని వివరించారు. పెట్టుబడిదారులు నగదును సమకూర్చుకునేందుకు వివిధ కమోడిటీలు, విలువైన లోహాల్లో తమ పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు.ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి వెండి ధరలు స్వల్పంగా కోలుకున్నప్పటికీ, అమెరికా డాలర్ బలపడటం, బాండ్ రిటర్నులు పెరగడం, ఫెడరల్ రిజర్వ్ తదుపరి నిర్ణయాలపై అనిశ్చితి కొనసాగుతుండటంతో సమీప భవిష్యత్తులో వెండి ధరలపై ఒత్తిడి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆసియా మార్కెట్‌లో బిట్‌కాయిన్ భారీ పతనం



న్యూయార్క్,నవంబరు 21: ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీ విలువ భారీగా పతనమవుతోంది. బిట్‌కాయిన్ ధర రెండేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. వారాంతంలో అమెరికా మార్కెట్లో 6 శాతం, శనివారం ఆసియా మార్కెట్లో మరో 5.7శాతం పతనమై బిట్‌కాయిన్ ధర 55,533 డాలర్లకు చేరినట్లు గ్లోబల్‌మీడియా వార్తలు వెలువడ్డాయి. 2024 సెప్టెంబర్ తర్వాత దీని విలువ ఇదే అత్యల్పం కావడం గమనార్హం. గతేడాది అక్టోబరులో 1.26 లక్షల డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరిన బిట్‌కాయిన్ ధర యేడాది వ్యవధిలోనే ఏకంగా 70 వేల డాలర్లకు పైగా పడిపోవడం గమనార్హం. మొత్తం క్రిప్టో మార్కెట్ విలువ 7.58 శాతం పతనమై 1.95 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు కాయిన్ మార్కెట్ క్యాప్ తెలిపింది. ఇటీవలి కాలంలో బిట్‌కాయిన్ మార్కెట్ తీవ్ర అనిశ్చితి ఎదుర్కొంటోంది. ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో ప్రతికూలతలు, రిస్క్ ఎక్కువగా ఉండే క్రిప్టోకరెన్సీల నుంచి మదుపర్లు తమ పెట్టుబడులను మళ్లించడం, పెరుగుతున్న రుణ వ్యయాలు ఇందుకు కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఇటీవల క్రిప్టో ఎక్స్ఛేంజీ బైనాన్స్ హ్యాకింగ్‌కు గురికావడం బిట్‌కాయిన్ సహా ఇతర డిజిటల్ టోకెన్స్‌పై ప్రభావం చూపింది. ఇక, క్రిప్టో కరెన్సీ విషయంలో నిబంధనలు సడలిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో సంకేతాలు ఇచ్చారు. ఇటీవల యూఎస్ మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు విజయం సాధించడంతో అక్కడ క్రిప్టో రంగానికి ప్రతికూలత ఉంటుందన్న ఆందోళనలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే పెట్టుబడిదారుల్లో నెలకొన్న అనిశ్చితి బిట్‌కాయిన్ క్షీణతకు కారణమవుతోంది.

గ్లోబల్ పరిణామాలు, ఎఫ్‌పిఐల పెట్టుబడులే సెన్సెక్స్, నిఫ్టీలకు ఈ వారం దిక్సూచి



ముంబయి,నవంబరు21: రానున్న సెలవులతో కూడిన స్వల్ప ట్రేడింగ్ వారంలో భారత ఈక్విటీ మార్కెట్లు అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల రాక, రూపాయి మారకం విలువ, ముడిచమురు ధరల కదలికలకు అనుగుణంగా స్పందించే అవకాశముంది. అంతర్జాతీయంగా అమెరికా ఆర్థిక గణాంకాలు మార్కెట్ల దృష్టిని ఆకర్షించనున్నాయి. ముఖ్యంగా మూడో త్రైమాసిక జిడిపి వృద్ధి, వ్యక్తిగత వినియోగ వ్యయాల ద్రవ్యోల్బణం, గృహ నిర్మాణ రంగం, వినియోగదారుల విశ్వాసానికి సంబంధించిన గణాంకాలు వెలువడనున్నాయి.దేశీయంగా ప్రైవేటు రంగ వ్యాపార కార్యకలాపాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నారు. నవంబర్ నెలకు సంబంధించిన హెచ్ఎస్‌బిసి ఇండియా పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ 23న విడుదల కానుంది. అంతర్జాతీయ టెక్నాలజీ షేర్ల కదలికలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా మార్కెట్ దిశను ప్రభావితం చేయనున్నాయి.
గురునానక్ దేవ్ ప్రకాశ్ గురుపురబ్ సందర్భంగా మంగళవారం 24న ఎన్ఎస్ఇ, బిఎస్ఇల్లో సాధారణ ట్రేడింగ్ జరగదు. దీంతో నిఫ్టీ నెలవారీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీని సోమవారానికి ముందుకు మార్చారు. అయితే బిఎస్ఇ సెన్సెక్స్ నెలవారీ ఎక్స్‌పైరీ మాత్రం 26వ తేదీ గురువారమే జరగనుంది. దేశీయ పరిణామాలు. నవంబర్ నెలకు సంబంధించిన హెచ్ఎస్‌బిసి ఫ్లాష్ ఇండియా పిఎంఐ గణాంకాలు నవంబరు 23, సోమవారం ఉదయం 10:30 గంటలకు విడుదల కానున్నాయి.అక్టోబరులో తుది హెచ్ఎస్‌బిసి ఇండియా సర్వీసెస్ పిఎంఐ 55.8గా నమోదైంది. కాంపోజిట్ పిఎంఐ 56.2గా, తయారీ రంగ పిఎంఐ 54.7గా ఉన్నాయి. నవంబరు గణాంకాలు ప్రైవేటు రంగ వ్యాపార కార్యకలాపాల్లో వృద్ధి వేగం కొనసాగుతోందా లేదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వనున్నాయి.అంతర్జాతీయ పరిణామాలుప్రపంచవ్యాప్తంగా నవంబర్ నెల ఫ్లాష్ పిఎంఐ గణాంకాలు, అమెరికా ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణ వివరాలు, గృహ నిర్మాణ రంగ నివేదికలు, వినియోగదారులు మరియు వ్యాపారసంస్థల విశ్వాసానికి సంబంధించిన సర్వేలు మార్కెట్లకు కీలకంగా మారనున్నాయి. మరోవైపు ముడిచమురు ధరలు, అమెరికా డాలర్ కదలికలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహాలు భారత ఈక్విటీ మార్కెట్లకు కీలక సూచికలుగా నిలవనున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.